నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 15-10-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 67 | పేజీలు:4 | వెల: రూ.1/-

అబార్షన్ వికటించి యువతి మృతి

నిజామాబాద్,అక్టోబర్ 14: అబార్షన్ వికటించి ఓ యువతి మృతి చెందింది. ఈ ఘటన రెంజల్ మండలం దూపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నానని యువకుడు నమ్మించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఆమె అతనికి శారీరకంగా దగ్గరైంది.

దీంతో సదరు యువతి గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న యువకుడు.. యువతికి అబార్షన్ చేయించేందుకు ఓ వైద్యుడి వద్దకు తీసుకెళ్లాడు. వైద్యం చేస్తుండగా వికటించి యువతి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చిత్తూరు జిల్లా నగరిలోని అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థినికి ఆమె ప్రియుడు విజయ్ అబార్షన్ చేయిస్తుండగా.. అది వికటించి విద్యార్థిని మృతి చెందిన విషయం తెలిసిందే.

కశ్మీర్‌లో ఇద్దరు హిజ్బుల్ ఉగ్రవాదుల అరెస్ట్

శ్రీనగర్,అక్టోబర్14(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్ పోలీసులు, నిఘా వర్గాలు కలిసి సోమవారం ఉదయం ఇద్దరు హిజ్బుల్ ముజాహిద్దీన్ ఉగ్రవాదులను అరెస్టు చేశారు. కశ్మీర్‌లోని గందర్బాల్‌లో ఉగ్రవాదులు తల దాచుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడ ఆపరేషన్ నిర్వహించి ఇద్దరు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. ఉగ్రవాదుల నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామాగ్రితో పాటు ఏకే-47 రైఫిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల 370 రద్దు తరవాత పోలీసులు భారీగా కూంబింగ్ చేపడుతున్నారు. అనుమానితులను గుర్తిస్తున్నారు. ఇందులో భాగంగా ఉగ్రవాదులను అరెస్ట్‌చేస్తున్నారు.

అందుబాటులోకి వచ్చిన మొబైల్ సేవలు

ఇదిలావుంటే జమ్మూకశ్మీర్‌లో పోస్టు పెయిడ్ మొబైల్ సేవలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఆర్టికల్ 370 రద్దు తర్వాత మొబైల్ సేవలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో 72 రోజుల తర్వాత పోస్టు పెయిడ్ మొబైల్ సేవలు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యమైన పర్యాటక ప్రదేశాల్లో ఇంటర్నెట్ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. మొత్తంగా 40 లక్షల పోస్టు పెయిడ్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు అనంతరం పరిస్థితుల అదుపునకు ప్రభుత్వం మొబైల్ సేవలపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. వాస్తవానికి పోస్ట్ పేయిడ్ మొబైల్ సేవలు అక్టోబర్ 12వ తేదీ నుంచే ప్రారంభం కావాల్సి ఉండగా సాంకేతిక సమస్యల కారణంగా సోమవారానికి వాయిదా వేశారు.

విలీనం తప్ప..మిగిలిన డిమాండ్లపై చర్చలకు సిద్ధం

- ఆత్మహత్య ఏ సమస్యకు పరిష్కారం చూపదు

- టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేశవరావు

హైదరాబాద్,అక్టోబర్14 (ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికులు తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని, కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగానే ఉందని, మొండివైఖరిని విడనాడాలని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలు బాధించాయని, ఆత్మహత్య ఏ సమస్యకు పరిష్కారం చూపదు అని ఆయన స్పష్టం చేశారు. పరిస్థితులు చేయిదాటక ముందే ఆర్టీసీ యూనియన్ నేతలు కార్మికులను సమ్మె విరమింపజేసి చర్చలకు సిద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వం లో ఆర్టీసీ విలీనం తప్ప కార్మికులు లేవనెత్తిన మిగతా డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని, ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం గతంలో గొప్పగా పరిష్కరించిందని గుర్తుంచుకోవాలన్నారు.

44శాతం ఫిట్‌మెంట్, 16 శాతం ఐఆర్ ఇచ్చిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కేశవరావు పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రయివేటీకరించే ప్రసక్తే లేదని సీఎం కేసీఆర్ చెప్పారని, అద్దె బస్సులు, ప్రయివేటు స్టేజీ క్యారేజీల విషయంలో సీఎం కేసీఆర్ ప్రకటనను ప్రస్తుత సమ్మె నేపథ్యంలో తీసుకున్న నిర్ణయంగా మాత్రమే చూడాలని కార్మికులకు కేశవరావు సూచించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో కలిపే ప్రతిపాదనేది ఎన్నికల ప్రణాళికలో చేర్చలేదని, ఆర్టీసీయే కాదు ఏ ప్రభుత్వ రంగ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని మేనిఫెస్టోలో పేర్కొనలేదని కేశవరావు స్పష్టం చేశారు. కార్మికులు అనాలోచిత నిర్ణయాలకు వెళ్లకుండా, మొండి వైఖరిని విడనాడాలని అన్నారు. వెంటనే ఆర్టీసీ సమ్మెను విరమించుకొని చర్చలకు సిద్ధంకావాలని కేశవరావు సూచించారు.

యూపీలో పెను విషాదం..

లక్నో, అక్టోబర్14(ఆర్ఎన్ఎ) : ఉత్తర్‌ప్రదేశ్‌లో సోమవారం ఉదయం పెను విషాదం చోటు చేసుకుంది. మౌ జిల్లా మొహ్మదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి వలీద్‌పూర్ గ్రామంలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో 11 మృతి చెందారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి రెండంతస్తుల భవనం కుప్పకూలింది.

ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని వెలికితీశారు. పేలుడు తర్వాత భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కల ఇళ్లలోని ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాదంపై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన బాధితులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని తెలిపారు. ఘటనా స్థలంలో సహాయకచర్యలు వేగవంతం చేయాలని, శిథిలాల్లో చిక్కుకున్న వారిని వీలైనంత త్వరగా బయటకు తీయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, శిథిలాల్లో చాలా మంది చిక్కుకున్నారని తెలుస్తోంది. సహాయక చర్యల్లో పోలీసులకు స్థానికులు సహకరిస్తున్నారు. ఉదయం 7.30 ప్రాంతంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. తొలుత సిలెండర్ నుంచి గ్యాస్ లీకై పేలుడు సంభవించినట్టు తెలుస్తోంది.

- ఇంట్లో పేలిన గ్యాస్ సిలిండర్

-11 మంది దుర్మరణం

మరో 15మందికి గాయాలు

మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురు హాకీ ఆటగాళ్లు మృతి

భోపాల్,అక్టోబర్14(ఆర్ఎన్ఎ): మధ్యప్రదేశ్‌లోని హోషంగాబాద్ సమీపంలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో నలుగురు జాతీయస్థాయి హాకీ ఆటగాళ్లు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు ఆటగాళ్లు గాయపడ్డారు. ఇటార్సీలో జరుగుతోన్న ధ్యాన్ చంద్ ట్రోఫీ హాకీ పోటీల్లో పాల్గొనేందుకు కారులో వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాయపడిన ముగ్గుర్నీ సమీపంలోని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిజేస్తున్నారు. వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. 69వ జాతీయ రహదారిపై రైసల్‌పూర్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఈ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వైద్యం కోసం హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదుచేసిన దర్యాప్తు చేపట్టారు. నాలుగు మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించినట్టు తెలిపారు. స్థానిక పోలీసుల సాయంతో మృతులను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. వేగంగా వాహనం నడపటంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది.

పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాద సమయంలో మొత్తం ఏడుగురు వాహనంలో ఉన్నట్టు గుర్తించారు.

గుజరాత్ ప్రమాదంలో నలుగురు మృతి

గుజరాత్‌లోని ఖేడా జిల్లా గల్టేశ్వర్ ప్రాంతంలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు- బస్సు ఢీకొన్న ఘటనలో నలుగురు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. మూల మలుపు వద్ద కారు అతి వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టిందని స్థానిక ఎస్పి దివ్య మిశ్రా తెలిపారు. మరోక వాహనాన్ని ఓవర్ టెక్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం. కారు డ్రైవర్ తప్పిదంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతులు రశిక్ చందులా పటేల్(75), అర్వింద్ విట్టల్ పటేల్(70), ఘ్యాన్‌శ్యామ్ నాగిందాస్ పటేల్(82), సురేష్ దల్‌సుఖ్ పటేల్(72)గా గుర్తించారు.

రైలెక్కబోతూ జారిపడ్డ యువతి

పట్టాలపై పడి అక్కడిక్కడే మృతి

హైదరాబాద్,అక్టోబర్14 (ఆర్ఎన్ఎ): హైదరాబాద్ శివారు లింగంపల్లి రైల్వే స్టేషన్లో దారుణం చోటు చేసుకుంది. రైలెక్కబోతూ ప్రమాద వశాత్తు కిందపడిన ఓ యువతి మృతిచెందింది. రైలెక్కుతూ ప్రమాదవశాత్తు పట్టాల మీద పడడంతో ఆమె మృతి చెందింది. పుష్పిత షా (20) అనే యువతి విజయవాడలో చదువు కుంటోంది. సోమవారం ఉదయం అమరావతి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలుజారి ట్రైన్ కింద పడి మృతి చెందింది. దీంతో వెంటనే మృతిచెందింది. గమనించిన కొందరు పోలీసులకు తెలియచేశారు. మృత దేహాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఉగ్రవాదులపై చర్యలు తీసుకోండి

- భవిష్యత్తు కోసం ఉగ్రవాద సంస్థలను నిర్వీర్యం చేయాలి

- హాఫీజ్ సహా అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- పాక్‌ను మళ్లీ హెచ్చరించిన అగ్రరాజ్యం

వాసిగ్టన్, అక్టోబర్14(ఆర్ఎన్ఎ): ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్‌ను అగ్రరాజ్యం అమెరికా మరోసారి హెచ్చరించింది. తన భూభాగంలోని ఉగ్రవాద సంస్థలను పాక్ నిర్మూలించాలని స్పష్టం చేసింది. లష్కరే తొయిబా సహా దాని అధినేత హాఫీజ్ సయీద్‌పై చర్యలు తీసుకోవాలని అమెరికా ఉద్ఘాటించింది. బ్లాక్ లిస్ట్‌లో ఉన్న పాకిస్థాన్ విషయంలో ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) కీలకమైన నిర్ణయం తీసుకునే సమయంలో అమెరికా హెచ్చరికలకు ప్రాధాన్యత ఏర్పడింది. లష్కరే తొయిబా, జమాతే ఉద్దవ్ సంస్థలకు చెందిన ముఖ్యమైన నేతల అరెస్ట్‌ను అమెరికా దక్షిణ, మధ్య ఆసియా వ్యవహారాల బ్యూరో చీఫ్ అలీసీ వెల్స్ స్వాగతించారు. నాలుగు రోజుల కిందట లష్కరే తొయిబాకు చెందిన నలుగురు కీలక నేతలను పాకిస్థాన్ అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. లష్కరే ఉగ్రవాద సంస్థ కీలక నేతలు ప్రొఫెసర్ జాఫర్ ఇక్బాల్, యాహ్యా అజీజ్, మమ్మద్ అష్రాఫ్, అబ్దుల్ సల్మాన్‌లను అరెస్ట్ చేశారు. పాకిస్థాన్ భవిష్యత్తు కోసం తమ భూభాగంలోని ఉగ్రవాద సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేయాలని ఆమె ట్విట్టర్ ద్వారా కోరారు. నలుగురు లష్కరే నేతల అరెస్ట్ చేసినట్టు వస్తున్న వార్తలను స్వాగతిస్తున్నామని, అయితే, భయంకర దాడులకు పాల్పడిన హాఫీజ్ సయీద్ సహా అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

ఉగ్రవాదులకు పాకిస్థాన్ స్వర్గధామంగా మారిన విషయం జగమెరిగిన సత్యమని, దశాబ్దాలుగా అది ఉగ్రవాదులను పెంచిపోషిస్తోందని అన్నారు. అంతర్జాతీయ సమాజం ఎంతగా హెచ్చరించినా ఉగ్రవాదం విషయంలో పాక్ తన పంథాను మార్చుకోవడం లేదని, తన భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలపై చర్యలు తీసుకోకపోగా, వారికి ఆర్థికంగా సాయం చేస్తున్నట్టు పక్కా ఆధారాలు లభించడంతో ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) పాక్‌ను బ్లాక్ లిస్ట్‌లో చేర్చుతూ ఆగస్టులో కీలక నిర్ణయం తీసుకుంది. ఆస్ట్రేలియా రాజధాని కాన్‌బెర్రాలోని జరిగిన సమావేశంలో ఎఫ్ఏటీఎఫ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు తీసుకుంటున్న చర్యల గురించి నివేదికను ఎఫ్ఏటీఎఫ్‌కి పాక్ ఇటీవలే సమర్పించింది. అయితే, పాక్ తీసుకున్న 40 రకాల చర్యల్లో దాదాపు 32 తమ నిబంధనలకు అనుగుణంగా లేవని ఎఫ్ఏటీఎఫ్ ఆసియా-పసిఫిక్ గ్రూప్ స్పష్టం చేసింది. మొత్తం 41 మంది సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో పాక్ చర్యలను ఏ ఒక్కరూ సమర్థించలేదు. ఉగ్రవాదులకు నిధుల సరఫరాను అడ్డుకునే అంశంలో పాక్ చేపట్టిన చర్యలు ఎఫ్ఏటీఎఫ్ నిబంధనలకు అనుగుణంగా లేవని సభ్యులు అభిప్రాయపడ్డట్లు తెలుస్తోంది. అయితే, ఈ నెలలో ఎఫ్ఏటీఎఫ్ సమావేశం జరగనుంది. పాకిస్థాన్ తన లక్ష్యాలను చేరుకోకుంటే బ్లాక్ లిస్ట్ ముప్పు నుంచి బయటపడటం అసాధ్యం. దీంతో మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీన్ని నుంచి బయటపడటానికే నాలుగు రోజుల కిందట నలుగురు కీలక అగ్రనేతలను అరెస్ట్ చేసింది. ఎఫ్ఏటీఎఫ్ సంతృప్తిచెందకపోతే ఇరాన్, ఉత్తర కొరియాతోపాటు పాక్ బ్లాక్ లిస్ట్‌లో కొనసాగుతుంది

పెన్షన్ల కోసం కేంద్రం నుంచి వచ్చేది రూ.206 కోట్లు మాత్రమే..!

హైదరాబాద్, అక్టోబర్ 14: ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు సంబంధించిన సమస్యలు, సలహాలు, ఫిర్యాదుల కోసం వెబ్‌సైట్, కాల్‌సెంటర్‌ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, పంచాయతీ రాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి జిల్లాకు టోల్ ఫ్రీ నంబర్, వెబ్‌సైట్ ద్వారా లబ్ధిదారులు ఫిర్యాదులు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం 10 జిల్లాల్లో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. త్వరలోనే అన్ని జిల్లాల్లోనూ ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాటల్లాడుతూ..'రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పెన్షన్ దారులకు, ఆసరా లబ్ధిదారులకు ప్రతీనెలా రూ. 864కోట్లు ఖర్చు పెడుతోంది. లబ్ధిదారులకు సరైన సమయంలో పెన్షన్ అందడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ఈ కాల్‌సెంటర్ ఉపయోగపడుతుంది. కాల్‌సెంటర్‌కు ఫిర్యాదు చేస్తే తక్షణమే స్వీకరించి సమస్యను పరిష్కరిస్తారు. ఇప్పటి వరకు 26 రకాల ఫిర్యాదులు వచ్చాయి. కేంద్రం నుంచి వచ్చేది రూ. 206 కోట్లు మాత్రమే.. రూ. 600 పైచిలుకు కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోందని' మంత్రి వివరించారు.

పీవీ-మన్మోహన్ ఆర్థిక విధానాలను అనుసరించాలి : పరకాల



న్యూఢిల్లీ , అక్టోబర్ 14: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ భర్త పరకాల ప్రభాకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఆర్థిక మాంద్యంపై తన అభిప్రాయాన్ని పరకాల ప్రభాకర్ వెల్లడించారు. పరకాల ప్రభాకర్ అభిప్రాయాన్ని ఓ జాతీయ దినపత్రిక ప్రచురించింది. దేశం తీవ్ర ఆర్థిక మాంద్యంలో చిక్కుకుంది. వాస్తవాలను కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ విధానాలే బాగున్నాయి. పీవీ, మన్మోహన్ సింగ్ ఆర్థిక విధానాలను బీజేపీ ప్రభుత్వం అనుసరించాలి. నెహ్రూ ఆర్థిక విధానాలను బీజేపీ విమర్శించడాన్ని కూడా పరకాల తప్పుబట్టారు. అధికార పార్టీ చర్య ఆర్థిక విమర్శగా లేదని రాజకీయ దాడిగానే మిగిలిపోయిందని, ఆ విషయాన్ని బీజేపీ ఇంకా గుర్తించడం లేదని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్న కూడా ఎన్డీఏ ప్రభుత్వం ఇంకా తిరస్కరణ ధోరణిలోనే వెళ్తుందని ప్రభాకర్ మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం కొత్త విధానాలను రూపొందించడానికి సుముఖత చూపడం లేదని.. దేశంలో ఒక రంగం తర్వాత మరో రంగానికి సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఆర్థిక మాంద్యం వల్ల నిరుద్యోగిత 45 ఏళ్ల గరిష్ట స్థాయికి చేరుకోవడమే కాకుండా.. వివిధ రంగాల్లో చాలా మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని పరకాల ప్రభాకర్ పేర్కొన్నారు.

పరిగిలో గురుకుల క్రీడలు ప్రారంభం

వికారాబాద్,అక్టోబర్14 (ఆర్ఎన్ఎ): పరిగి సమీపంలోని తుంకులగడ్డలో గల సాంఘిక సంక్షేమ గురుకులంలో జోనల్ స్థాయి క్రీడలు ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవంలో వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్, గురుకులాల కార్యదర్శి ప్రవీణ్ కుమార్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రాంతీయ సమన్వయాధికారి డా. శారద వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 14, 15, 16తేదీలలో క్రీడలు కొనసాగనున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, హైదరాబాద్ జిల్లాల్లోని గురుకులాలకు చెందిన విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొంటారు. ఈ క్రీడలలో పాల్గొనేందుకు వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు ప్రత్యేక వాహనాలలో పరిగికి చేరుకున్నారు. 39 గురుకులాలకు చెందిన 1,611 మంది క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొంటారు.

సికింద్రాబాద్ స్టేషన్‌లో బాలిక కిడ్నాప్

హైదరాబాద్, అక్టోబర్ 14: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సోమవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో రెండేళ్ల బాలిక కిడ్నాప్ అయింది. నెల్లూరు జిల్లా కావలి మండలం రామన్నగరిపల్లి గ్రామానికి చెందిన డి. సురేశ్(25) తన కుమారుడు ప్రభాస్(5), కూతురు స్వర్ణలత(2)తో కలిసి ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ స్టేషన్‌కు వచ్చాడు. నెల్లూరుకు వెళ్లాల్సిన సురేశ్ ఆ రోజు రాత్రి అక్కడే తన పిల్లలతో కలిసి నిద్రించాడు. అయితే సోమవారం తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో నిద్ర లేచి చూసేసరికి తన కూతురు కనిపించలేదు. స్టేషన్ మొత్తం వెతికినా స్వర్ణలత ఆచూకీ లభించలేదు. దీంతో రైల్వే పోలీసులకు సురేశ్ ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్టేషన్‌లో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా.. 25 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి బాలికను కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. ఐదో నంబర్ గేట్ నుంచి బయటకు వెళ్లినట్లు ఫుటేజీల్లో నమోదైంది. బాలిక ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్



హైదరాబాద్, అక్టోబర్ 14: ఈ ఏడాది ఆర్థికశాస్త్రంలో నోబెల్ ప్రైజ్‌ను ముగ్గురికి ప్రకటించారు. అభిజిత్ బెనర్జీ, ఈస్తర్ డుఫ్లో, మైఖేల్ క్రీమర్‌కు ఈ అవార్డును సంయుక్తంగా గెలుచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా పేదరికాన్ని నిర్మూలించేందుకు ఈ ముగ్గురూ వినూత్న ప్రయోగాన్ని చేపట్టారని నోబెల్ కమిటీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. కేవలం రెండు దశాబ్ధాల్లోనే ఈ ముగ్గురు ప్రతిపాదించిన పరిశోధనా సిద్ధాంతాలు ఆర్థికవ్యవస్థను మార్చేశాయన్నారు. ముగ్గురు ప్రతిపాదించిన సిద్ధాంతం.. చిన్న చిన్న ప్రశ్నలతో కీలక సమాచారాన్ని సేకరించే విధంగా చేసిందన్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి మెరుగయ్యేందుకు కావాల్సిన అనేక అంశాలను వారి సిద్ధాంతంలో ప్రతిపాదించినట్లు నోబెల్ కమిటీ చెప్పింది. కెన్యా లాంటి ప్రాంతంలో పాఠశాల ఫలితాల అభివృద్ధిని మెరుగుపరిచిందన్నారు. భారత్ లాంటి దేశంలోనూ ఆర్థిక సూత్రాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు కమిటీ తెలిపింది. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు ఈ ముగ్గురు ప్రతిపాదించిన నమోనాలను విశేషంగా వినియోగిస్తున్నట్లు కమిటీ చెప్పింది. ఆర్థికవేత్తల ప్రతిపాదన వల్ల సుమారు 50 లక్షల

చరిత్రలో నేటినిజం

కం॥ 'మొగలాయీ' సామ్రాజ్యమునకు
'మొగసాలగ' పేరుగాన్న మూర్ఖన్యుండౌ
అగణిత ఘనుడగు 'అక్బరు'
పగతుర గుండియల లోన పవళించెధరిత్రిన!!

(అక్టోబర్ 15 అక్బర్ చక్రవర్తి జన్మదినం..)

-రాధశ్రీ

సెల్: 9494481210

కొత్త ఔషధాల ఆవిష్కరణ జరగాలి..

నేటినిజం
మంగళవారం 15-10-2019

ఔషధ అమ్మకాలకు ఇదివరకు మనదేశంలో విస్తృతమైన అవకాశాలు ఉండేవి. అవకాశాలు అందిపుచ్చుకునే సమయంలో బహుళజాతి సంస్థలు నిబంధనలను నిలుపుకునే స్థితిలో దారుణంగా విఫలమవుతున్నాయి. ముఖ్యంగా ఔషధ పరీక్షల నిర్వహణ పేరిట అవి పేదల ప్రాణాలతో ఆడుకుంటున్నాయి. అయినా కేంద్రప్రభుత్వం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఈ ఏడాది కేంద్రం అనుమతించిన 162 పరీక్షలు జరిపే విధానాన్ని వీడియోలో నిక్షిప్తం చేయాలని ఆదేశించింది. పకడ్బందీ చట్టాన్ని తీసుకొచ్చేంతవరకు పరీక్షలను అనుమతించవద్దని గట్టిగా సూచించింది. ఔషధ పరీక్షల పరిశోధనలు ప్రస్తుతం దేశంలో పెద్ద వ్యాపారంగా మారాయి. దాదాపు వంద కంపెనీలకు పైగా ఇక్కడ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. అమాయకులు నిరక్షరాస్యులనే అవి లక్ష్యంగా చేసుకుంటున్నాయి. అమాయకులు, నిరక్షరాస్యులనే అవి లక్ష్యంగా చేసుకుంటున్నాయి. భారత్‌లో మనుషుల ప్రాణాలకు విలువ లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. పార్లమెంటరీ స్థాయీసంఘం సైతం ఈ దారుణ పరిస్థితులను తీవ్రంగా తప్పుపట్టింది. సర్కారు విధానాల్లోని లోసుగులను ఎండగట్టింది. ఇక్కడి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఔషధ ఫలితాలను అమెరికా, ఐరోపా దేశాల్లో చూపిస్తూ మందులకు అనుమతులు సంపాదిస్తున్నాయి. ప్రపంచ విఫణిలో అధిక ధరలకు వాటిని అమ్ముతూ లాభాలు మూటకట్టుకుంటున్నాయి. ఇదికాక దేశంలో అంతుచిక్కని వ్యాధులు పుట్టుకొస్తున్నాయి. ఆ కమిటీ మందులు లభ్యంకాక పెద్ద సంఖ్యలో రోగులు మరణిస్తున్నారు. అందువల్లే మనదేశ వైద్యరంగంలో నిత్య పరిశోధనలు ఔషధ పరీక్షలు అనివార్యం. విదేశాల్లో విజయవంతమైన మందులు మనకు సరిపోకపోవచ్చును. గన్యా, మలేరియా, టిబీ వంటి వ్యాధులు మన దేశంలోనే ఎక్కువగా వ్యాపిస్తుంటాయి. ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా కొత్త ఔషధాల ఆవిష్కరణ జరగాలి. ఈ పరీక్షలన్నీ చట్టపరిధిలో మానవీయ దృక్కోణంలో నిర్వహించాలి. వాటిని వీడియో తీసేలా చట్టాన్ని సవరించాలని సుప్రీంకోర్టు సహా ఔషధ సాంకేతిక సలహా బోర్డు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ విధానం అమలులోకి వచ్చినపుడే పారదర్శకత సాధ్యపడుతుంది. మరణించిన లేదా అస్వస్థతకు గురైనవారికి ఇచ్చే పరిహారం మొత్తాన్ని గణనీయంగా పెంచాలి. ఉచిత వైద్య సహాయం అందచేయాలి. నూతన ఔషధాల ఆమోదం, పరీక్షలు, తదితర అంశాలను పరిశీలించడానికి నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు లోగడ వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దీన్ని తక్షణం ఆచరణలోకి తీసుకోవాలి. భారత వైద్య పరిశోధన మండలి రూపొందించిన జీవ వైద్య పరిశోధనలకు సంబంధించిన ముసాయిదా బిల్లును తక్షణం పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టరూపంలోకి తీసుకుని వచ్చినపుడే ఔషధ సంస్థల ఆగడాలకు, వారి చేసే అన్యాయపు వ్యాపారాలకు కాస్తయినా విరామం దొరకుతుంది!!

ఆర్టీసీ ఆత్మహత్యల పాపం ఎవరిది?

హైదరాబాద్, అక్టోబర్ 14:తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సమ్మె తీవ్ర రూపం దాల్చడంఒక ఎత్తయితే ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలు కలకలం రేపుతున్నాయి. తెలంగాణలో ఆత్మహత్యలు ఉండవని అనుకుంటే అంతకకుమించి అన్నట్లుగా పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నారు. ఇలాంటి దుస్థితి రావడానికి ప్రభుత్వం ప్రధాన బాధ్యత వహించాలి. కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే నిమ్మకునీరెత్తినట్లుగా ఉంటూ విపరీత వ్యాఖ్యలు చేయడం మంత్రులకు తగదు. సిఎం కెసిఆర్ కూడా ఆర్టీసీని చక్కదిద్దాలనుకుంటే దానికి కార్మికులను బలిచేయరాదు. ఎందరో త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణలో ఇటీవల ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలు ఆందోళన కలిగించాయి. వాటి విషయంలో అసలు సర్కార్ కనీస బాధ్యత్యగా కూడా స్పందించలేదు. ఇప్పుడు ఆర్టీసీ విషయంలో కూడా ఇలాంటి ధోరణిని అవలంబించడం తెలంగాణ ఏర్పడ్డది ఇందుకేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఆత్మహత్యచేసుకున్న డ్రైవర్ శ్రీనివాసరెడ్డి మృతదేహానికి అర్తరాత్రిలోగా అంత్యక్రియలు జరపాలని ఒత్తిడి చేయడం, కుటుంబ సభ్యులను బెదరించడం ఏ రకమైన ప్రజాసవ్యామ్యమో చెప్పాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాంటి ఘాతుకాలుజరగలేదు. పోలీసు బలగాలతో బెరింపు రాజకయాఆలు చేయడం ఎంతమాత్రం మంచిది కాదు. ఆర్టీసీ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ.. కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శ్రీనివాసరెడ్డి అంత్య క్రియలు ఆదివారం అర్థరాత్రి నిర్వహించాలనే ఒత్తడి వెనక ఎవురు ఉన్నారో ప్రజలకు తెలియంది కాదు. శ్రీనివాస్ రెడ్డి మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం ఖమ్మం తరలించిన పోలీసులు.. రాత్రికిరాత్రే అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆదివారం అర్ధరాత్రే శ్రీనివాస్ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీనివాస్ రెడ్డి అంతిమయాత్రలో ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు మధ్య రాత్రి 9 గంట సమయంలో శ్రీనివాసరెడ్డి అంతిమయాత్ర ప్రారంభమైంది. యాత్ర బైపాస్ రోడ్డు ఎక్కగానే కాల్వోడ్డు హిందూ శ్మశాన వాటికకు తరలించేందుకు పోలీసలు ప్రయత్నించగా.. కార్మిక సంఘాలు అడ్డుకున్నాయి. ఆర్టీసీ డిపో మీదుగా పోనివ్వాలని పట్టుబట్టారు. దీంతో పోలీసులకు, కార్మికుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎట్టకేలకు యాత్ర బస్‌డిపో మీదుగా శ్మశానవాటిక వద్దకు సాగింది. రాత్రి 11 గంటల తర్వాత అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఇదంతా కూడా నాజీల పాలనను గుర్తుకు తెచ్చింది. ప్రజల సమస్యలు పరిష్కరించే సత్తా కావాలి. పక్కదారి పట్టించి కార్మికులను శ్మశానానికి పంపే నిర్ణయాలు కాదని గుర్తుంచుకోవాలి. పదిరోజులుగా సాగుతున్న సమ్మె పండుగవేళ అటు ప్రజలను ఇటు కార్మిక కుటుంబాలను కూడా ఇక్కట్ల పాల్జేయడమే గాకుండా ప్రజలంతా ఆందోళన చెందుతున్నారు. తాను వద్దంటున్నా కార్మికులు సమ్మెకు పోయారన్న ఏకైక కారణంతో ఆగ్రహించిన ప్రభుత్వం సమూల ప్రక్షాళన పేరిట చేస్తున్న ప్రకటనలు కార్మికులను మరింత ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. అయితే ప్రభుత్వమే ఎప్పుడూ పెద్దన్న పాత్ర పోషించి రాష్ట్రంలో అనిశ్చిత పరిస్థితి రాకుండా చూడాలి. కార్మికులను బజ్జగించేప్రయత్నం చేయాలి తప్ప రెచ్చగొట్టేలా చేయడం తగదు. ఉద్యోగాలపై ఆందోళనతో ఇప్పటికే ముగ్గుకు కార్మికులు బలయ్యారు. దీనిని కూడా తప్పుదోవ పట్టించేలా విపక్షాలే కారణమంటూ విమర్శలు చేయడం దారుణం కాక మరోటి కాదు. తెలంగాణ ఉద్యమంతో, పోరాటాలతో సంబంధం లేని వారు మంత్రి పదవులు వెలగబెడుతూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం తగదు. సిఎం కెసిఆర్కు నచ్చచెప్పి కార్మిక సమస్యను పరిష్కరించే బాధ్యత తీసుకోవాలే తప్ప ఇలా కాదు. వీరి కారణంగా ఇరుపక్షాల మధ్యా అగాధాన్ని పెంచుతున్నాయి. సమ్మెను చట్టవ్యతిరేకంగా అభివర్ణిస్తూ, ప్రభుత్వం వద్దంటున్నా సమ్మెచేస్తున్నందున 48వేలమంది కార్మికులు తమకు తాముగానే 'సెల్ఫ్ డిస్మిస్' అయ్యారనీ, ఇక ఆర్టీసీలో మిగిలింది పన్నెండు వందలమంది మాత్రమేనని ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన వ్యాఖ్యలు కూడా సరికాదు. దీనిని కార్మిక సంఘాలు,ప్రజా సంఘాలు,రాజకీయ పక్షాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. ప్రభుత్వం సమ్మెను శాంతియుతంగా పరిష్కరించేందుకు కాక, కఠినవైఖరిని ఎంచుకోవడం ప్రైవేటీకరణ కుట్రగా విపక్షాలతో పాటు ప్రజలూ అనుమానిస్తున్నారు. ప్రభుత్వం ముందున్న 26 డిమాండ్లలో అత్యధికం హఠాత్తుగా పుట్టుకొచ్చినవేమీ కావు. సుదీర్ఘకాలంగా ఇవి పరిష్కారానికి నోచుకోనందున, ఆర్టీసీ కార్మికులు కొద్ది నెలలుగా సమ్మె యోచనలో ఉన్నారన్నది తెలిసిందే. వినతులూ విన్నపాలతో ప్రభుత్వం దృష్టిని ఆకర్షించేందుకు వారు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే సమ్మెకు దిగుతామన్న హెచ్చరికలతో పాటు, ఇప్పుడు నిరవధిక సమ్మెకు నోటీసులు ఇచ్చికూడా సుమారు నెలరోజులు దాటింది. వారి సమస్యల పరిష్కారానికీ, సమ్మె నివారణకూ ప్రభుత్వం ఇంతకాలం ప్రయత్నించకుండా చివరినిముషంలో సమ్మెవాయిదా లక్ష్యంగా ఓ కమిటీ ప్రకటించి, చర్చలు విఫలమై సమ్మె మొదలు కాగానే ఇక దానితో పనిలేదనడం సరికాదు. నాలుగుదశాబ్దాలుగా యూనియన్లు చెలాయిస్తున్న దాష్టీకమే తమ తీవ్ర నిర్ణయాలకు కారణమని పాలకులు అంటున్నారు. గతంలో మాదిరిగా ఇప్పుడూ సమ్మెచేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఆర్టీసీ కార్మికుల పక్షాన మాట్లాడినవారే ఇప్పుడు సగటు వేతనాల లెక్కలు విప్పుతూ సమ్మెను ప్రజల దృష్టిలో అన్యాయమైనదిగా చూపేందుకు తాపత్రయపడుతున్నారు. కానీ, స్వరాష్ట్రంలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా, కార్మికులు దీర్ఘకాలం సంయమనంతో వేచిచూసి చివరకు విధిలేని స్థితిలో సమ్మెకు ఉపక్రమించిన వాస్తవాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు. కార్మికులను అణచివేసే, ప్రజా ఉద్యమాలను అణగదొక్కే ధోరణి సరికాదు.

ఆర్టీసీ కార్మికులవి గొంతెమ్మ కోర్కెలా?

టాక్స్‌లను తగ్గించాలనడంలో తప్పేముంది

ఆర్టీసీ పరిరక్షణ చర్యలు సూచిస్తే తప్పా?

హైదరాబాద్,అక్టోబర్14(ఆర్‌ఎన్‌ఎ): ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా తెలంగాణలోనూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై ప్రభుత్వానికి అభ్యంతరం ఉండవచ్చు. ఆర్థిక భారం లేదా ఇతరత్రా కారణాలు కూడా ఉండిఉండొచ్చు. అయితే సమ్మె నోటీస్ ఇచ్చిన వెంటనే ఇతరత్రా సమస్యలను పరిష్కరించి ఆ ఒక్క సమస్య పక్కన పెట్టివుంటే ఇంతదాకా వచ్చేది కాదు. మిగతా డిమాండ్ల విషయంలోనైనా అది ఇప్పటికే వేగంగా కదిలివుంటే బాగుండేది. కార్మిక సంఘాల డిమాండ్లలో అనేక సంస్థ నిలబెట్టేవే తప్ప గొంతెమ్మ కోర్కెలు కానేకావు. వివిధ రకాల బస్సు పాసులకు ఆర్టీసీ ఇస్తున్న సబ్సిడీని ప్రభుత్వం తిరిగి సంస్థకు చెల్లించని కారణంగా అది ఏటా వందలకోట్ల రూపాయలు నష్టపోతోంది. పెరిగిన ఇంధనం ధరలకు అనుగుణంగా టికెట్ ధరలు పెంచలేకపోవడంతో, కనీసం డీజిల్‌పై రాష్ట్రం విధిస్తున్న వ్యాట్ రద్దు చేయమన్న కార్మికుల డిమాండ్‌లో తప్పేముంది? దానికి సమాధానం చెప్పాలి. ఇంధనం ఖర్చులో నాలుగవంతు పన్నులే ఉన్నప్పుడు, వాటిని రద్దుచేస్తే సంస్థ నష్టాల్లో 40శాతం మేర తగ్గిపోయే స్వస్థపడ, దీనినీ, మరో మూడువందల కోట్ల మేరకు మోటార్ వెహికల్ పన్నును, విడిభాగాలపై విధిస్తున్న పన్నును రద్దుచేసి సంస్థను నష్టాల బారినుంచి పూర్తిగా బయటపడవేయవచ్చు. కానీ ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. కొత్త నియామకాలు జరపకుండా, రిటైరయిన వారి స్థానాలను భర్తీచేయకుండా మిగిలినవారిపై పనిఒత్తిడిని పెంచడం ఎంతవరకు సబబో చెప్పాలి. ఆర్టీసీని నిలబెట్టాల్సింది పోయి, దానిని నష్టాల్లో ముంచడం, కక్షసాధిస్తున్నట్లుగా వ్యవహరించడం సముచితం కాదు. కార్మికుల చర్యలను ప్రజావ్యతిరేకమైనవిగా నిరూపించే ప్రయత్నానికి స్వస్తిపలికి, ప్రజాసౌకర్యంగాలోని ఈ ప్రధాన సంస్థను పరిరక్షించే దిశగా ప్రభుత్వం కృషిచేసేవుంటే బాగుండేది. ఇవాళ అనివార్యమైన సమ్మె ఉండేది కాదు. ముగ్గురు కార్మికులు ఆత్మహత్యకు పాల్పడే వారు కాదు. కార్మికులు చేస్తున్న ఈ డిమాండ్లను గొంతెమ్మ కోర్కెలుగా చూపి వారిని అణిచివేయాలన్న ధోరణి ప్రజాస్వామ్యానికి చేటుగా గుర్తించాలి. ఇకపోతే ఉన్న ఉద్యోగులను పక్కన పెట్టి కొత్తగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లను రిక్రూట్ చేసుకోవడం మరింత రెచ్చగొట్టే చర్య తప్ప మరొకటి కాదు. రోజువారీ ప్రాతిపదికన ఆర్టీసీలో అదనపు డ్రైవర్లు, కండక్టర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం నాడు నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ మేరకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఎంపికైన అభ్యర్థులకు రోజువారీ డ్రైవర్లకు రూ.1,5 00, కండక్టర్లకు రూ.1,000 చొప్పున పారితోషికం ఇవ్వనున్నది. ఆర్టీసీలో పనిచేయడానికి ఆసక్తిగల రిటైర్డ్ ట్రా ఫిక్, మెకానికల్ సూపర్‌వైజర్లకు రోజువారీ పారితోషికం రూ.1,500 చెల్లించనున్నది. ఆయా డిపోల్లో రోజుకు రూ. 1,000 చొప్పున రిటైర్డ్ మెకానిక్స్, శ్రా మిక్స్‌లతో పాటు ఎలక్ట్రీషన్స్, టైర్ మెకానిక్స్, క్లరికల్‌గా పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థులే కాక ఇతర శాఖల్లో పనిచేసిన డ్రైవర్లు, రిటైర్డ్ ఉద్యోగులు నుంచి టీఎస్‌ఆర్టీసీ దరఖాస్తులు ఆహ్వానించింది. ఆర్టీసీకి చెందిన ఒల్వా, ఎసి, మల్టీ యాక్సిల్ బస్సులను నడిపేందుకు అనుభవం ఉన్న డ్రైవర్లు, మెకానిక్ల నుంచి కూడా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇది ఎంతవరకు సబబో అన్నది ఆలోచించాలి.

టిఎన్జీవో నేతల ద్వంద్వనీతి

కెసిఆర్‌తో భేటీ తరవాత మారిన స్వరం

సమ్మెను రాజకీయ నేతల చేతుల్లో పెట్టొద్దంటూ వ్యాఖ్యలు

హైదరాబాద్,అక్టోబర్14(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టీ ఎన్జీవోలు నాలుకను మడతేశారు. ఇంతకాలం ప్రభుత్వంపై ప్రత్యక్షంగా పరోక్షంగా విమర్శలు గుప్పిస్తూ వచ్చిననేతలు ఇప్పుడు యూ టర్న్ తీసుకున్నారు. సిఎం కెసిఆర్‌తో సమావేశం తరవాత వారు మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు వారి రాజకీయాలను బహిర్గతం చేశాయి. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించండి. అయితే, రాజకీయ నాయకుల చేతిలో నిర్ణయాలను పెట్టకండని ఆర్టీసీ జేఏసీకి టీఎన్జీవోల అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి హితవు పలకడం, ఆర్టీసీ జెఎసి తమతో చర్చించవద్దని చెప్పడం అంతా ఫక్తు రాజకీయంగా సాగింది. మాకు చెప్పి మీరు సమ్మెకు వెళ్లారా? కనీసం సంప్రదించ కుండా మమ్మల్ని ఎలా బాధ్యులను చేస్తారని ప్రశ్నించడం దిగజారుడుకు నిదర్శనంగా చూడాలి. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ అత్యవసర సమావేశాన్ని ఆదివారం నిర్వహించడమే గాకుండా ఆర్టీ సీ ఆందోళనలో విపక్షాల జోక్యం ఎందుకన ఇప్రశ్నించడం ద్వారా భవిష్యత్‌లో తమకు కెసిఆర్ అండవుంటుందన్న ధీమాను కనబర్చారు. దీంతో ఇకముందు వీరు ఏదేని సమస్య వచ్చి ప్రభుత్వంతో విభేదిస్తే విపక్షాల అండ దొరకదని గుర్తుంచుకోవడం లేదు. విభజించి పాలించే కుట్రలో వీరు సమిధలు అవుతన్నామని కూడా గుర్తించడం లేదు. గతంలో ఆర్టీసీ కార్మికులకు ఫిట్‌మెంట్ ఇప్పించడంలో ప్రధాన పాత్ర ఉద్యోగులదేనని కారెం చెప్పారు. ఉద్యోగుల జేఏసీ ఎవరి మోచేతుల నీళ్లు తాగడం లేదని,

హుజూర్‌నగర్ అసెంబ్లీస్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల తర్వాత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం కేసీఆర్ హామి ఇచ్చారని స్పష్టం చేశారు. త్వరలో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం మాకు ఉందన్నారు. భోజనం సమయంలో వెళ్లిన తమకు సీఎం కేసీఆర్ భోజనం పెట్టారని, దాన్ని కూడా కొంతమంది వక్రీకరించడం ఎంత వరకు సమంజసమని రవీందర్‌రెడ్డి ప్రశ్నించారు.

ఆర్టీసీ జేఏసీ కార్మికులు కోరితే సంఘీభావం తెలపడంపై తమ వైఖరి వెల్లడిస్తామని రవీందర్‌రెడ్డి చెప్పారు. శ్రీనివాస్ రెడ్డి ఆత్మాహుతి బాధాకరమంటూనే . కార్మికుల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించదగినవేనన్నారు. సమ్మె గురించి తమ దృష్టికి తీసుకువచ్చి ఉంటే, తమ సమస్యలతో పాటు వారి సమస్యలను కూడా ప్రభుత్వం ముందుంచేవాళ్లమని సన్నాయి నొక్కులు నొక్కారు. అంతేగాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీఎం కేసీఆర్‌ను మేము కలిస్తే తప్పా?అని కూడా అని టీజీవో అధ్యక్షురాలు మమత ప్రశ్నించారు. ఉద్యోగుల జేఏసీ ఏ రాజకీయ పార్టీతో కలిసి పని చేయబోదని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు సెల్ఫ్ డిస్మిస్ అయ్యారన్న వ్యాఖ్యలను రాజకీయ కోణంగా మాట్లాడినట్లుగా తాము భావిస్తున్నామన్నారు. ఆ వ్యాఖ్యలు ఆర్టీసీ యాజమాన్యం చేయలేదనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. మొత్తంగా ఎన్జీవో నేతలు మాటమార్చే స్థాయిలో మాట్లాడారు. ఓ రకంగా ఆర్టీసీ కార్మికులనే తప్పు పట్టడం, వారికి ప్రత్యక్ష మద్దతు ఉండదన్నవ ఇషయం చెప్పారు.

ప్రజా క్షేమమే ఆశయం

జల్‌గామ్/బాంద్రా, అక్టోబర్ 14: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని ఆదివారంనాడు ఇక్కడ ప్రారంభించిన నరేంద్ర మోదీ కాంగ్రెస్, ఎన్సీపీలను లక్ష్యంగా చేసుకుని తీవ్ర సవాళ్లతో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పలు ర్యాలీల్లో మాట్లాడిన మోదీ విపక్షాల తీరును ఎండగట్టడంతోపాటు తమ ప్రభుత్వం తీసుకున్న అనేక సాహసోపేత నిర్ణయాలను గట్టిగా ప్రస్తావించారు. ప్రపంచ దేశాలన్నీ ఎన్నో కీలక సవాళ్లను ఎదుర్కోవడంలో సతమతం అవుతుంటే భారత్ మాత్రం బలంగా నిలబడి వాటిని ముఖావఖిగా ఢీకొంటోందని తెలిపారు. తమ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమవే పరమార్థమని, వారికోసమే అహరహం పనిచేస్తుందని తెలిపారు. అలాగే పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎన్నో పథకాలను అమలు చేస్తోందని బాంద్రాలోని నకోలీలో జరిగిన ర్యాలీలో మోదీ తెలిపారు. మరింత బలమైన గుర్తింపును ఇచ్చే సరికొత్త శక్తితో తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన అన్నారు. జల్‌గామ్ ర్యాలీలో మాట్లాడిన మోదీ 'దమ్ముంటే 370 అధికరణను పునరుద్ధరిస్తామని మీ మేనిఫెస్టోల్లో పెట్టండి' అని కాంగ్రెస్, ఎన్సీపీలకు మోదీ సవాల్ చేశారు. ఈనెల 21వ తేదీన జరుగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని జరిగిన తొలి ఎన్నికల ర్యాలీలో మాట్లాడిన మోదీ 'జమ్మూకాశ్మీర్ అన్నది కేవలం ఓ భూభాగం మాత్రమే కాదు. అది భారతావనికి మకుటాయమానం' అని తెలిపారు. ఆ రాష్ట్రంలో నాలుగు దశాబ్దాలపాటు నెలకొన్న ప్రతికూల పరిస్థితులను కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే తాము సాధారణ స్థాయికి తీసుకువచ్చామని మోదీ ఈ సందర్భంగా తెలిపారు. 370 రాజ్యాంగ అధికరణ అంశాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం విపక్షాలు వాడుకుంటున్నాయని ధ్వజమెత్తిన మోదీ 'పొరుగుదేశం మాదిరిగానే ఇక్కడి పార్టీలూ మాట్లాడుతున్నాయి' అని ఆరోపించారు. గత ఐదేళ్ల కాలంలో దేవేంద్ర ఫడ్నవిస్ సారథ్యంలోని మహారాష్ట్ర అద్భుతంగా పనిచేసిందని ఆయన ప్రశంసించారు. ఈ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అవినీతి లేదని, అన్ని వర్గాల ప్రజల్లోనూ విశ్వాసం పెరిగిందని మోదీ పేర్కొన్నారు. కాశ్మీర్‌కు సంబంధించి

కాంగ్రెస్, ఎన్సీపీలవి మొసలికన్నీళ్లేనని, వీరికి ఏమాత్రం ధైర్యం ఉన్నా 370 అధికరణ రద్దును పునరుద్ధరిస్తామని చెప్పాలని మోదీ మరోసారి సవాల్ చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు కథనాలను కట్టిపెట్టాలని, ప్రజలు ఆమోదించిన కేంద్ర నిర్ణయాన్ని తాము అంగీకరిస్తున్నదీ లేనిదీ తేల్చిచెప్పాలని ఈ రెండు పార్టీలన మోదీ కోరారు. బీజేపీ ప్రభుత్వం చెప్పేదే చేస్తుందని ఉద్ఘాటించిన మోదీ కాశ్మీర్ విషయంలో తమ నిర్ణయాన్ని గట్టిగా సమర్థించుకున్నారు. ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేస్తామని చెప్పి, ఆ నిర్ణయాన్ని అమలు చేశామని, ముస్లిం మహిళలకు న్యాయం చేశామని ఆయన అన్నారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం ఈ నిర్ణయాన్ని అడ్డుకునేందుకే చివరివరకూ ప్రయత్నించాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, ఎన్సీపీల పేరును నేరుగా ప్రస్తావించకుండా 'ఈ రెండు పార్టీలు ఒకదానిపై ఒకటి ఆధారపడ్డాయి. మహారాష్ట్ర ప్రజల కలలను, అలాగే యువత ఆకాంక్షలను నెరవేర్చే సత్తా వీటికి లేదు' అని మోదీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమిని బలపరిచినందుకు రాష్ట్ర ప్రజలకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. నవభారత నిర్మాణానికి రాష్ట్ర ప్రజలు ఇచ్చిన మద్దతు ఎంతగానో తోడ్పడిందని పేర్కొన్న ఆయన దేశ ప్రజలంతా ఒక్కతాటిపై నిలిచి తమకు పూర్తి మెజారిటీ కట్టబెట్టడం వల్లే ప్రపంచంలోనే భారత్ ఓ బలమైన శక్తిగా నిలబడగలుగుతోందని అన్నారు.

గత ఐదేళ్లలో రాష్ట్రంలో మత సామరస్యాన్ని పెంపొందించామని, రైతుల్లోను, పారిశ్రామికవేత్తల్లోనూ విశ్వాసాన్ని ఇనుమడింపజేయగలిగామని అన్నారు. రెండోసారి కూడా ఫడ్నవిస్ నాయకత్వాన్ని బలపరచాలని, రానున్న ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజారిటీతో పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత

-కార్మికులకు మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యే సీతక్క

వరంగల్,అక్టోబర్14(ఆర్‌ఎన్‌ఎ): సీఎం కేసీఆర్, మంత్రుల రెచ్చగొట్టే వ్యాఖ్యలకు మనస్తాపం చెంది శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారని మలుగుఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా హన్మకొండలో ఆమె ఆందోళనలో పాల్గొన్నారు. ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డిది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, మంత్రుల రెచ్చగొట్టె ప్రకటనలే ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు కారణమని ఆరోపించారు. ఆర్టీసీ సంస్థకున్న 50 వేల కోట్ల ఆస్తులపై కేసీఆర్ కన్నేశారని అన్నారు. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. హన్మకొండ డిపో వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు నిర్వహించి నిరసన తెలిపారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలు, ప్రైవేటు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు గోబ్యాక్ అని నినదించారు. సమైక్యాంధ్రప్రదేశ్‌లోనే ఆర్టీసీ విభజన పక్రియ మొదలైంది. జీఓలు జారీ చేసే సమయానికి రాష్ట్ర విభజన పక్రియ ప్రారంభమైంది. దీంతో ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన పక్రియ నిలిచిందని చెప్పారు. ఆర్టీసీ విలీన పక్రియ నాటి ఆంధప్రదేశ్‌లోనే మొదలైందని, ఆ సమయంలో అప్పటి ఉద్యమ నేత గా ఉన్న కేసీఆర్‌తో పాటు నేతలంతా చెప్పినట్లుగానే స్వరాష్ట్రంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసీ కార్మికులు కోరుతున్నారన్నారు. ఈ డిమాండ్ కొత్తగా వచ్చిందేమి కాదనాన్రు. ఇక తాను చెప్పినట్లే వినాలన్నట్లుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని ఆమె విమర్శించారు. రాష్ట్ర సంపదంతా తనకు, మెగా కృష్ణారెడ్డికి అన్నట్లుగా కేసీఆర్ వ్యవహరిస్తూ తన సొంత ఆస్తిగా పరిగణిస్తున్నారని ధ్వజమెత్తారు.

విపక్షాలకు 370 ఆర్టికల్ సవాల్

మోడీ ప్రకటనతో విపక్షాలకు గుబులు

ప్రధాన ప్రచారాంశంగా మారిన కశ్మీర్

ముంబై,అక్టోబర్14(ఆర్‌ఎన్‌ఎ): జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని తిరిగి అమలు చేస్తామంటూ ప్రజలకు హామీ ఇవ్వగలరా అని ప్రతిపక్షాలకు ప్రధాని మోదీ సవాల్ విసరడం ద్వారా విపక్షాలను ఆత్మరక్షణలోకి నెట్టారు. ఈ ఎన్నికల్లో ఇదే అంశం ప్రధాన ప్రచారాంశంగా మారుతుందని అనుకున్న వారికి ప్రధాని సవాల్ స్పష్టం చేసింది. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో ఇపపటికే విపక్షాలు కకావికలం అయ్యాయి. ఇప్పుడు ఈ వ్యవహారం వారికి గుదిబండగా మారి, వారి విజయావకాశాలను పూర్తిగా దెబ్బతసీఇంది. మరోవైపు ఈ రెండు రాష్ట్రాల్లో మరోమారు బిజెపి హవా స్పష్టంగా కనిపిస్తోంది. ఈ అంశంపై విపక్షాలు స్పష్టత లేకపోవడం ఇప్పుడు వారికి సంకటంగా మారింది. అందుకే దీనిని ప్రచారంశాంగా మార్చారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ప్రధాని మోదీ జల్‌గావ్‌లో మొట్టమొదటి ర్యాలీలో పాల్గొన్నారు. 'జమ్మూకశ్మీర్ అంటే కేవలం చిన్న భూభాగం కాదు, దేశానికి అది మకుటం వంటిది. 40 ఏళ్లుగా అక్కడ నెలకొన్న పరిస్థితులను సాధారణ స్థాయికి తేవటానికి మాకు నాలుగు నెలలు కూడా పట్టలేదు. ఎంతో కీలకమైన ఆర్టికల్ 370 రద్దును ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయి. పాకిస్తాన్ మాదిరిగా మాట్లాడుతున్నాయి. కశ్మీర్‌పై దేశమంతటా ఏకాభిప్రాయంతో ఉండగా ప్రతిపక్ష నేతలు మాత్రం విరుద్ధంగా మాట్లాడుతున్నారు. దమ్ముంటే ఆర్టికల్ 370, 35ఏలను తిరిగి అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టండి చూద్దాం'అంటూ సవాల్ విసిరారు. నిజానికి 370 రద్దుతో బిజెపి గ్రాఫ్ పెరిగింది. ప్రజల్లో విశ్వాసం పెరిగింది. అందకే మోడీ ధైర్యంగా ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించే ప్రతిపక్షాలకు భవిష్యత్తే ఉండదన్నారు. 'వేర్పాటు వాదం, ఉగ్రవాదం వేళ్లూనుకున్న కశ్మీర్ పూర్తిగా వెనుకబాటుకు గురయింది. జమ్మూ, కశ్మీర్, లధాఖ్‌ల్లో నివసించే వాల్మీకి వర్గం వారికి కనీస హక్కులు కూడా కరువయ్యాయి. అందుకే ఎవ్వరూ ఊహించలేని విధంగా కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తి రద్దు నిర్ణయం తీసుకున్నాం. మా ప్రభుత్వం చెప్పిందే చేస్తుంది'అని మోదీ అన్నారు. అలాగే, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ట్రిపుల్ తలాక్‌ను శిక్షార్హం చేస్తూ తాము తెచ్చిన చట్టంపై కూడా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. చేతనైతే ట్రిపుల్ తలాక్ విధానాన్ని తిరిగి ఆచరణలోకి తెస్తామని ప్రకటించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఫడ్నవిస్ ప్రభుత్వం అన్ని వర్గాల విశ్వాసాన్ని చూరగొందని మోదీ ప్రశంసించారు.

అంబానీ, ఆదానీల ఆస్తులే ఎందుకు పెరిగాయ్

ఫెర్బ్స్ ప్రకటన తరవాత ఇప్పుడు చర్చ

న్యూఢిల్లీ,అక్టోబర్14(ఆర్‌ఎన్‌ఎ): పోర్బ్స్ జాబితా మేరకు అంబానీ, ఆదానీలు ముందు వరుసలో నిలబడ్డారు. భారత్ విషయానికి వస్తే 2019 సంవత్సరంలో 100 మందితో కూడిన అత్యంత ధనవంతుల జాబితాను ఫోర్బ్స్ సంస్థ ఇటీవల విడుదల చేసింది. దేశంలోని అత్యంత సంపన్నులకు సంబంధించి ఆయా సంస్థలు విడుదల చేసే జాబితాలను చూస్తే ఒక విషయం మాత్రం అర్థమవుతోంది. 2014, 2019 సంవత్సరాలకు సంబంధించి ఫోర్బ్స్ సంస్థ పరిశీలిస్తే గత ఐదేళ్ల మోడీ పాలనలో కార్పొరేట్ల ఆస్తులు ఏవిధంగా పెరిగాయనేది అర్థం అవుతుంది. టాప్ 100 మంది ధనవంతుల ఆస్తులు ఈ ఐదేళ్లలో కాలంలో రూ.25 లక్షల కోట్ల నుంచి రూ.32 లక్షల కోట్లకు పెరిగాయి. ఈ వంద మంది ఆస్తులే దేశ జడిపిలో 6 శాతానికి సమానంగా ఉన్నాయి. అదే సమయంలో దేశంలోని కోట్లాది మంది ప్రజలు సరైన ఆహారం లేక ఆకలితో అలమటిస్తున్నారు. ప్రసుత్తం దేశంలో నెలకొన్న ఆదాయ అంతరాలకు ఇది తార్కాణంగా నిలుస్తోంది. పోర్బ్స్ విడుదల చేసిన జాబితాలో ముఖేష్ అంబానీ మొదటి స్థానంలో నిలిచారు. ఆయన ఆస్తి గత ఐదేళ్ల కాలంలో రెట్టింపు అయింది. 2014లో రూ.1.68 లక్షల కోట్లుగా ఉన్న ఆయన ఆస్తి, 2019 సంవత్సరం వచ్చే సరికి 118 శాతం పెరుగుదలతో 3.65 లక్షల కోట్లకు పెరిగింది. అదేవిధంగా గౌతమ్ అదానీ ఆస్తుల వివరాలను పరిశీలిస్తే.. ఆయన ఆస్తుల్లో 121 శాతం మేర పెరుగుదల కనిపించింది. 2014లో రూ.50.4 వేల కోట్లుగా ఉన్న అదానీ ఆస్తి, 2019 నాటికి రూ.1.1 లక్షల కోట్లకు చేరింది. ప్రతిగా 2014లో 11వ స్థానంలో ఆయన 2019 నాటికి రెండో స్థానానికి ఎగబాకారు. వీరిద్దరూ కూడా ప్రధాని మోడీకి, అధికార పార్టీ బిజెపికి సన్నిహితంగా మెలిగేవారే కావడం గమనార్హం. అంబానీకి చెందిన జియోను లాంచ్ చేసే సమయంలో కూడా ఆ సంస్థ ఇచ్చిన ప్రకటనల్లో కూడా మోడీ బొమ్మ ఉంది. అనంతరం ఈ మూడేళ్ల కాలంలో జియో దేశంలోనే అతిపెద్ద టెలికాం సంస్థగా అవతరించింది. ఇక మోడీ, అదానీకి ఉన్న అనుబంధం మోడీ గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న సమయం నాటిది. సాధారణంగా వివిధ సంస్థలు ఆయా సంవత్సరాలకు సంబంధించి ధనవంతుల జాబితాను విడుదల చేసే క్రమంలో దీనిపై కార్పొరేట్ ప్రపంచానికి అమితాసక్తి ఉంటుంది. అయితే ఏదో ఒక 100 మంది కార్పొరేట్ వ్యక్తులు ఆస్తులు పెరిగినంత మాత్రాన దేశంలో ఉన్న 130 కోట్ల మంది ప్రజల ఆస్తులు కూడా పెరిగాయనేది సత్యదూరం అనేది అందరికీ తెలిసిన విషయమే. దేశంలో కార్పొరేట్ పెద్ద తలలుగా పేరు అనుభవిస్తున్న వారికి బిజెపి గురువు అయిన ఆర్‌ఎస్‌ఎస్‌తో ప్రత్యేక అనుబంధాలు ఉన్నాయంటారు. కేంద్రంలోని బిజెపి సర్కార్‌ను ప్రసన్నం చేసు కునేందుకు ముందుగా ఆర్‌ఎస్‌ఎస్ నాయకులతో వీరు సన్నిహితంగా మెలుగుతారు. ఆ సంస్థ నిర్వహించే పలు కార్యక్రమాలకు కూడా వెళ్తుంటారు. ఇటీవల నాగపూర్‌లో నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ అవతరణ దినోత్సం కార్యక్రమానికి హెచ్‌సిఎల్ అధినేత శివనాడార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దానికి కొద్ది రోజుల ముందు అజీమ్ ప్రేమ్‌జి ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి ఆ సంస్థ ఆధ్యక్షుడు మోహన్ భగవత్‌తో సమావేశం అయ్యారు. ఏప్రిల్‌లో రతన్ టాటా కూడా నాగపూర్ కార్యాలయానికి వెళ్లారు. పైగా గత సంవత్సరం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నడిచే నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు టాటా ట్రస్టు రూ.100 కోట్ల విరాళం ఇచ్చింది. మొత్తంగా ఇదంతా ఓ పద్ధతి ప్రకారం సాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. కార్పోరేట్లకు అనుకూలంగా తీసుకునే నిర్ణయాలు సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

మోడీ చర్య స్ఫూర్తి మంత్రమే తప్ప మార్పు కాదు

కాలుష్యం,ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు కఠిన చట్టాలే మందు
గంగా కాలుష్యం నివారణలో నెరవేరని సంకల్పం

న్యూఢిల్లీ,అక్టోబర్14(ఆర్ఎన్ఎ): చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాక సందర్భంగా మహాబలిపురంలో ఉదయమే మార్నింగ్ వాక్‌లో ప్రధాని మోడీ ప్లాస్టిక్ ఏరివేత పనులు ప్రారంభించి అందరినీ ఆకట్టుకున్నారు. సోషల్ మీడియాతో పాటు, బిజెపి మీడియా కూడా దీనిని బాగా ఉపయోగించుకున్నది. సముద్రతీరంలో ప్లాస్టిక్ వేస్ట్‌ను ఏరేస్తూ ప్రధాని మోడీ నిజంగానే చిత్తశుద్ధి ప్రదర్శించారు. అయితే ఈ దేశంలో కోట్లాది మంది వాడిపడేస్తున్న ప్లాస్టిక్, ఇతర చెత్తను లక్షల్లో కార్మికులు ఎత్తేయడం వల్ల సాధ్యం కావడం లేదు. ప్రజల్లో పరివర్తన రాకుంటే దేశంలో కాలుష్యం పెరగగలదు. ఇందుకు ప్రజాచైతన్యంతో పాటు, ప్రజల్లో బాధ్యత రావాలి. అందుకు కఠిన వైఖరి అవలంబిస్తే తప్ప సాధ్యం కాకపోవచ్చు. ప్రధాని మోడీని చూసి ప్రజలు మారిపోతారనుకుంటే భ్రమే కాగలదు. గంగానది ప్రక్షాళన, పునరుజ్జీవం కోసమని ప్రధాని మోడీ ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి దాన్ని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉంచింది. కానీ ఏం లాభం? ఇంతవరకూ జరిగిందేమీ లేదని గంగ దీనిస్థితిని చూస్తే తెలుస్తుంది. పర్యావరణ పరిరక్షణలో జలాశయాలను, నదులను రక్షించుకోవడం అత్యంతావశ్యకం అయినా వాటిని ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదని మోడీ పాలన చూస్తే తెలుస్తుంది.నమామి గంగే అంటూ హారతులు ఇస్తే కాలుష్యం పోదన్న విషయం రుజువు చేసింది. కాలుష్యం నుంచి గంగను రక్షించాలని పోరాడిన ఓ యోధుడి మరణం కూడా ప్రధాని మోడీని కదిలించలేకపోయింది. గంగానది పరిరక్షణకోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ ప్రొఫెసర్ అగర్వాల్ గతేడాది మరణం అత్యంత విషాదకరంగా ముగిసింది. గంగా ప్రక్షాళన చూడకుండానే ఆయన కన్నుమూసారు. తన జీవితకాలంలో గంగపరిరక్షణ కోసం పలుమార్లు దీక్షలు చేసి, ప్రభుత్వాల మెడలు వంచగలిగిన ఆయన ఈ మారు ఆ పనిచేయలేక ఏకంగా ప్రాణాలే వదలాల్సి వచ్చింది. గంగకంటే ప్రాణం ముఖ్యం కాదని ప్రకటించి, చివరిరోజుల్లో నీటిని సైతం స్వీకరించడం మానివేసిన ఆయన పట్టుదల అనన్యసామాన్యమైనది. గంగ పిలుస్తోందన్నవారు, నమామి గంగే అని మొక్కిన ప్రధాని మోడీని చూశాక ఆయనలో సంకల్ప బలం ఇనుమడించింది. సులభంగానే తన ఆశయాలను నెరవేరుస్తారని ఆయన భ్రమించి ఉంటారు. తన దీక్షకు దిగివచ్చి, తప్పులు సరిదిద్దుకొని గంగపై మరింత మనసుపెడతారని అనుకొనివుంటారు. కానీ అదొక ప్రచారాంశం అన్న సంగతిని గుర్తించలేక పోయారు. ఇకపోతే గంగా ప్రక్షాళన కావచ్చు, ప్లాస్టిక్ ఏరివేత కావచ్చు... పర్యావరణ పరిరక్షణకావచ్చు...చెత్త లేకుండా చేయడం కావచ్చు.. దేశంలో కఠిన చట్టాలతో మాత్రమే వీటిని అడ్డుకోగలం. ప్రజల్లో మార్పు నఅ÷-నది స్వతహాగా రావాలే తప్ప ప్రచారాలతో రాదు. లేదా కఠినంగా చెత్తవేసినా, ప్లాస్టిక్ వేసిన పెద్ద ఎత్తున ఫైన్ వేస్తేనే సాధ్యం కావచ్చు. ఐదేళ్ల క్రితం గంగాహారతి సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడుతూ 2019లో జరగబోయే మహాత్మాగాంధీ 150వ జయంతి నాటికల్లా గంగానదిని ప్రక్షాళన చేసి ఆ మహనీయుడి స్మృతికి ఘనంగా నివాళి అర్పిద్దామని పిలుపునిచ్చారు. అందుకోసం రూ. 20,000 కోట్లు వ్యయం కాగల 'నమామి గంగ' ప్రాజెక్టుకు అంకురార్పణ చేశారు. కానీ నిధుల కేటాయింపు, వ్యయం చేస్తున్న తీరు గమనిస్తే ఆ లక్ష్యం నెరవేరలేదు. నిర్లక్ష్యం కారణంగా దేశంలో అతిపెద్ద నది గంగా ప్రక్షాళన నత్తనడకన సాగుతోంది. ఇలాగే సాగితే మన గంగను మనం స్వచ్ఛంగా జీవిత కాలంలో కూడా చూడలేం.ఎంతగా అంటే గంగలో మునగాలంటే భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది. మానవ తప్పిదాల వల్ల మన జలాశయాలు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. వీటి రక్షణకు బృహత్ ప్రణాళిక అవసరం. అలాగే కఠినచట్టాలు కూడా కావాలి. అందుకు సంకల్పబలం కూడా అవసరం. గంగా నదిపై సుప్రీంకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) తరచూ ఇస్తున్న ఆదేశాలు మన ప్రభుత్వాల తీరుతెన్నుల్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా నదుల విషయంలో ఇంకా చెప్పించుకునే స్థితిలోనే ఉన్నం తప్ప... ప్రశంసించదగ్గ రీతిలో ప్రభుత్వాలు పనులు చేయడం లేదు. అయిదు రాష్ట్రాల్లో వందల కిలోమీటర్ల నిడివిలో ప్రవహించే గంగానది కొన్ని దశాబ్దాలుగా కాలుష్యం బారిన పడుతోంది. ఆ నీరు తాగడం మనుషులకు, జంతువులకు హానికరమయ్యే దుస్థితి ఏర్పడింది. తాగడం మాటెలా ఉన్నా కాశీకి లేదా హరిద్వార్‌కు వెళ్లి శుభ్రంగా గంగస్నానం చేసే అవకాశం లేకుండా పోయింది. హరిద్వార్, కనౌజ్‌లాంటి ఘాట్‌లలో నీటిని పరీక్షించి చూస్తే స్నానానికి అది పనికిరాదని తేలింది. యూపీఏ ప్రభుత్వ హయాంలో, ప్రస్తుతం ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చాక గంగ ప్రక్షాళన కోసం భారీ యెత్తున నిధులు కేటాయించారు. ఖర్చు చేసిన నిధులు వృధా అయ్యాయని చెప్పడానికి కళ్లకు కనిపిస్తున్న కాలుష్యమే నిదర్శనం. వచ్చే రెండేళ్లలో ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ వరకూ గల 543 కిలోమీటర్ల మేర పురపాలక సంస్థల నుంచి మురుగునీరు, పరిశ్రమల వ్యర్థాలు, చర్మశుద్ధి కేంద్రాల వ్యర్థాలు నదిలో చేరకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి ఎన్‌జీటీ గతంలోనే ఆదేశాలిచ్చింది. వ్యర్థాలు నదిలో విడిచిపెట్టే వారికి రూ. 50వేల మేర జరిమానా విధించాలని సూచించింది. ఈ ఆదేశాలు ఈ ప్రాంతంలోని గంగానదికి మాత్రమే కాదు... దాని ఉప నదులకు కూడా వర్తిస్తాయి. తమ ఆదేశాలను సక్రమంగా అమలు చేస్తే 27 శాతం మేర కాలుష్యం తగ్గుతుందని ఎన్‌జీటీ లెక్కేసింది. హరిద్వార్, ఉన్నావ్‌ల మధ్య జనా వాసాల నుంచి 86 మురుగు కాల్వలు ఈ నదిలో కలుస్తున్నాయి. వందవరకూ పరిశ్రమలున్నాయి. ఈ నది ప్రవహించే అయిదు రాష్ట్రాల్లో వేయి పరిశ్రమలుంటే అవి రోజుకు 50 కోట్ల లీటర్ల వ్యర్థాలను నదిలో విడుస్తున్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కానీ వాటి కట్టడిలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. అలాగే ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టేందుకు కూడా ప్రత్యేకంగా కఠిన చట్టాలను అమలు చేస్తేనే సాధ్యం అవుతుంది. ప్రధాని మోడీ ప్లాస్టిక్ ఏరివేత ఓ స్ఫూర్తిగానే ఉంటుంది తప్ప మార్పుకు నాంది మాత్రంకాదు.

కాలుష్య కాసారంగా హుస్సేన్ సాగర్

ఏటా నిమజ్జనాలతో మురికి కూపం
పాలకుల చిత్తశుద్ధి లోపంతో పెరుగుతున్న కాలుష్యం

హైదరాబాద్,అక్టోబర్14 (ఆర్ఎన్ఎ): కాలుష్యం కలవర పెడుతోంది. క్యాన్సర్‌ను భూతంలా వదులుతోంది. అయినా పాలకుల్లో మార్పు రావడం లేదు. ప్రజల్లో చైతన్యం రావడం లేదు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రకటనలే తప్ప ఆచరణ కానరావడం లేదు. ప్రజలను బాధ్యతా రహితంగా చేసి పాలకులు తమ పబ్బం గడుపుకుంటున్నారు. అవసరమైన వాటికి చట్టాలు చేస్తూ కఠినంగా అమలు చేస్తున్న ప్రభుత్వం కాలుష్యనిరోధం విషయంలో బాధ్యతలను విస్మరించింది. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా అయినా ఇది బాగుపడుతందన్న ఆశలను కూడా వమ్ము చేసింది. హైదరాబాద్ హుస్సేన్ సాగర్‌నే తీసుకుంటే అది తళుక్కున మెరిసే తటాకంగా మారుతుందన్న భరోసా కల్పించిన సిఎం కెసిఆర్ నాలుగేళ్లలో దాని కాలుష్యంపై పెద్దగా పట్టించుకోలేదు. పోగా ఇది మరింత దరిద్రంగా అంటే మరింత కాలుష్య కూపంగా మారింది. ఇటీవలి వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిసిన ఆనందం కన్నా, నిమజ్జనం తరవాత అది ఎంతగా కాలుష్య కేంద్రంగా మారిందో దాని చుట్టుపక్కల వెళ్లే వారికి తెలుస్తుంది. కంపు కొడుతూ ముక్కులు మూసుకునే స్థితి నుంచి మార్పు రాలేదు. తీసుకోవాల్సిన చర్యలు చూస్తుంటే బెంబేలెత్తించేలా ఉన్నాయి. వినాయక నిమజ్జనంతో చెత్తాచెదారం పేరుకుపోయి కాసారాలన్నీ కాలుష్యంగా తయారయ్యాయి. హుస్సేన్ సాగర్, సరూర్ నగర్, సఫిల్‌గూడ లాంటి చెరువుల్లో కాలుష్యం పేరుకుని పోయింది. ఇందులో చెత్తను తొలగించ వచ్చేమో కానీ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ లాంటి కాలుష్యాన్ని తొలగించు కోలేక పోతున్నాం. ఏటా ఇలాంటి వ్యర్థాల వల్ల ఇప్పుడు చెరువులన్నీ ఎందుకూ పనికిరాకుండా కాలుష్య నీటితో నిండి పోతున్నాయి. దీనికి పరిష్కారం ఆలోచించాలి. హుస్సేన్ సాగర్ ప్రక్షాళను వందల కోట్లు ఖర్చు చేసినా చుక్కనీటిని కూడా శుభ్రం చేసిన దాఖలాలు లేవు. పాలకుల్లో చిత్తశుద్ధి లేదనడానికి ఇదొక్క ఉదాహరణ మాత్రమే. నగరం నడిబొడ్డున ఉన్న ఈ తటాకాన్ని బాగు చేయాలేమా అన్నది ఆలోచించాలి. దీనికి కేటాయించిన నిధులు నీళ్లలో పోసిన పన్నీరుగా మారుతున్నాయే తప్ప లాభం లేకుండా పోతోంది. హుస్సేన్ సాగర్ ప్రక్షాళనకు కంకణం కట్టుకున్నానని చెప్పిన సిఎం కెసిఆర్ నాలుగు న్నరేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నా కఠిన చర్యలు తీసుకోలేదు. అధికారుల్లో జవాబుదారీతనం లేకపోతే ఇలాగే జరుగుతుంది. పాలకులు కఠినంగా లేకుంటే పనులు జరగవని గుర్తించాలి. అలాగే చిన్నపాటి విమర్శలతో పెద్ద సంకల్పాన్ని పక్కన పెట్టరాదు. మన హుస్సేన్ సాగర్లో హైదరాబాద్ చుట్టూ ఉన్న పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యం చేరుతోంది. దీంతో సాగర్ పరిసరాలకు వెళ్లాలంటేనే దుర్గంధంగా మారింది. ఇలాంటి దశలో దీని సమూల ప్రక్షాళనకు సిఎం కెసిఆర్ చర్యలకు ఉపక్రమించగానే విమర్శలు మొదలయ్యాయి. ఇలాంటి విమర్శలు ఎప్పుడూ ఉండనే ఉంటాయి. కాలుష్యం తొలగించామా లేదా అన్నదే ముఖ్యం. అందుకు ఎంతటి కఠిన చర్యలకైనా వెనకాడరాదు. వినాయక నిమజ్జనాలతో కాలుష్యం వస్తుందనుకుంటే వాటిని ఆపేయాలి. అలాంటి కఠిన నిర్ణయాలతో జలాశయాలను పరిరక్షించుకోవాలి. పరిశ్రమల ఏర్పాటుకు అనుమతించినప్పుడే అందులోని వ్యర్థాలను ఏం చేస్తారన్నది అధికారులకు తెలుసు. అయినా అనుమతులు ఇస్తూ పోవడం వల్లనే ఇవాళ హుస్సేన్ సాగర్ కావచ్చు కాలుష్య కారకాలకు కేంద్రంగా మారుతున్నాయి. కాలుష్యకారక పరిశ్రమల వల్ల నదీజలాల్లో క్రోమియం, కాడ్మియం, సీసం, కోబాల్ట్ వంటివి వచ్చి చేరుతున్నాయి. భూగర్భ జలాలకు సైతం ఈ కాలుష్యం అంటుతోంది. చివరకు తినే తిండి కూడా కలుషితమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం కఠిన చర్యలు తీసుకోకుంటే భవిష్యత్ మరింత ప్రమాదకరంగా మారగలదని గుర్తుంచుకోవాలి.

శరవేగంగా జనగామ అభివృద్ధి

కలసికట్టుగా ముందుకు సాగుతున్నాం: ఎమ్మెల్యే

జనగామ,అక్టోబర్14(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశిస్సులు అండదండలతో జనగామ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తున్నామని అందుకు సిఎం కెసిఆర్ నుంచి పూర్తి సహాయ సహకారాలు పొంది నిధులు విడుదలకు కృషి చేస్తున్నామని ఎమమెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత జనగామ వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తే జిల్లాను నెంబర్‌వన్ స్థాయికి తీసుకెళ్లే అవకాశముందని రుజువు చేశామని ఆనందం వ్యక్తం చేశారు. జనగామ ప్రాంతం జిల్లా కావడం,ఏడాదిలోగా కార్యాలయాలకు శంకుస్థాపనలు చేసుకోవడం, అభివృద్ధిలో దూసుకుని పోయేలా గోదావరి పరవళ్లుసాగడం అంతా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. జనగామ ప్రాంత ప్రజలు జిల్లా కోసం గొప్ప పోరాటం చేశారన్నారు. అందుకే జనగామ జిల్లా అభివృద్ధిని ఒక సవాల్‌గా తీసుకొని పని చేస్తున్నా మని అన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయడం మంచి పరిణామమని అన్నారు. జనగామ జిల్లా ఏర్పాటులో ప్రతి ఒక్కరూ కీలకంగా నిలిచారని అన్నారు. జనగామ జిల్లాకు ప్రత్యేకత ఉందని, ఈ ప్రాంతం నుంచే అనేక ఉద్యమాలు వచ్చాయని చెప్పారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా జిల్లాను పప్రథమంగా నిలపాలని కోరారు. జిల్లాలోని 2లక్షల 86 వేల ఎకరాలకు దేవాదుల ద్వారా సాగు నీరందించబోతున్నట్లు వెల్లడించారు. ఇక్కడ చాలా రిజర్వాయర్లు ఉన్నాయని, వాటిని దేవాదుల ద్వారా చెరువులను నింపుతున్నామన్నారు. పెంబర్తి, బచ్చన్నపేట, చేర్యాల, తరిగొప్పుల చెరువుల్లో ఇప్పుడు గోదావరి జలాలతో నిండుతున్నాయంటే అది ముఖ్యమంత్రి కృషి, పట్టుదలే అని ఆయన పునరుద్ఘాటించారు. దేవాదుల ద్వారా జనగామ జిల్లాకే ఎక్కువ లబ్ధి కలుగుతున్నదని చెప్పారు. వ్యవసాయరంగం ప్రాధాన్యతను గుర్తించి రైతును రాజు చేయాలనే లక్ష్యంతో అనేక పథకాలు అమలు చేస్తున్నారని, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవి, చెప్పనివి పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. జనగామను ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చడంలో భాగంగా జిల్లాలో మెడికల్ కళాశాలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ వస్తే కరెంట్ కష్టాలొస్తాయని సమైక్యవాదులు భయపెట్టారని గుర్తుచేశారు. 24 గంటల కరెంట్‌ను ఇస్తుంటే విపక్షాలకు పాలుపోవడం లేదన్నారు. అందుకే వారు ఏవేవో కారణాలతో విమర్శలు చేస్తున్నారని అన్నారు.

సూర్యాపేట డిపోముందు కార్మికుల ధర్నా

కార్మికులను అడ్డుకున్న పోలీసులు

సూర్యాపేట,అక్టోబర్14 (ఆంఎన్ఎ): సూర్యాపేట ఆర్టీసీ డిపో దగ్గర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆర్టీసీ కార్మికులు డిపో ఎదుట ధర్నాకు పూనుకున్నారు. తాత్కాలిక సిబ్బందిని గేటు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కార్మికులు డిపో ముందే బైఠాయించడంతో... బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి పదో రోజుకు చేరింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆర్టీసీ కార్మికులు తమ పోరాటాన్ని ఉధృతం చేస్తూ భవిష్యత్ కార్యాచరణ ప్రకటించారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా డిపోల ఎదుట బహిరంగ సభలు నిర్వహించారు. 15న రాస్తారోకోలు, 16న విద్యార్థుల ర్యాలీలు, 17న ధూందాం కార్యక్రమాలు, 18న బైక్ ర్యాలీలు చేపట్టాలని ఐకాస నిర్ణయించింది.

ధర్నాలో కాంగ్రెస్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి కార్మికులు, నేతలను అరెస్టు చేసి.. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మహిళా కార్మికురాలు ఒకరు సొమ్మసిల్లి పడిపోయారు. పోలీస్‌స్టేషన్‌లో కార్మికులు, నేతల ధర్నా కొనసాగుతోంది.

ధాన్యాన్ని మార్కెట్‌లోనే అమ్ముకోవాలి

సంగారెడ్డి,అక్టోబర్14(నేటినిజం ప్రతినిధి): రైతులు పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధరను అందించేందుకు గాను మద్దతు ధరలను నిర్ణయించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించిన రైతులకు 48 గంటల్లోగా డబ్బులను వారి ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రైతులు దళారులను నమ్మి మోసపో వద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని అధికారు లు సూచించారు. జోగిపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయ పరిధిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జోగిపేట మార్కెట్ పరిధి లో గతంలో కంటే ఈసారి ఎక్కువగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, దళారీ వ్యవస్థను అరికట్టేం దుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

యాదాద్రి అభివృద్ధికి సంకల్పం

హుజూర్‌నగర్‌లో విపక్షాలకు భంగపాటు తప్పదు: సునీత

యాదాద్రి భువనగిరి,అక్టోబర్14 (ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి ఆశిస్సులు యాదాద్రికి సంపూర్ణంగా ఉన్నాయని, ఆయన సహకారంతో ఈ కొత్త జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామని ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. హుజూర్ నగర్‌లో గెలుపు టిఆర్ఎస్‌దే అన్నారు. యాదాద్రి ఆలయం పునర్నిర్మాణంతో ఈ ప్రాంతం అంతర్జాతీయ ఖ్యాతి దక్కుతుందని అన్నారు. ఇప్పటికే పనులు శరవేగంగా పూర్తి కావస్తున్నా యని అన్నారు. ఓ వైపు జిల్లా ఏర్పాటు,మరో వైపు యాదాద్రి ఆలయ అభివృద్ధి అన్నది తమ పూర్వ జన్మ సుకృతమన్నారు. ఇది సిఎంగా కెసిఆర్ తమకిచ్చిన వరంగానే భావిస్తున్నామని అన్నారు. ఆలేరులో అభివృద్ధి జరిగిందనడానికి ఇదొక్కటి చాలన్నా రు. కెసిఆర్ లేకుంటే ఇవి జరిగేవి కావన్నారు. పరిపాలన సౌలభ్యత, ప్రజల అవసరాల కోసమే కొత్త జిల్లాలు మండలాలు ఏర్పాటు జరిగిం దన్నారు. ప్రజలకు పూర్తి సౌకర్యాలు అందుబాటులో ఉండేందుకే ముఖ్య మంత్రి కేసీఆర్ నూతన జిల్లాలు, డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేశారని అన్నారు.గతంలో ఏనాడం ఖనా ఇంతటి నిర్ణయం జరగ్గా చూశామా అని ప్రశ్నించారు. ఇప్పుడు కొత్త కార్యాలయాలు కూడా అందు బాటులోకి రానున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన జిల్లాల విభజనతో ప్రజల చెంతకు పాలన వచ్చిందని ఎమ్మెల్యే కొనియాడారు. జిల్లాల ఏర్పాటు తెలంగాణలో చారిత్రా త్మక ఘట్టమని ఆమె అభివర్ణి ంచారు. ఉద్యమ నాయకుడే సీఎం కావడంతో రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగా నిల్చిందన్నారు. ఒకపక్క ఉద్యమానికి రూపకల్పన చేస్తూనే సాధించుకున్న రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను రూపొందించారన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలిపాని పేర్కొన్నారు. హుజూర్‌నగర్ఉప ఎన్నికలో టిఆంఎస్ విజయం ఖాయమని అన్నారు.

తెలంగాణలో కేసీఆర్ తుగ్లక్ పాలన

ఇంటింటా ప్రచారం చేయాలన్న వివేక్

సూర్యాపేట,అక్టోబర్14 (ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో తుగ్లక్ పాలన కొనసాగుతుందని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకులు వివేక్ వెంకటస్వామివిమర్శించారు. ప్రజల సమస్యలకు, ఆందోళనకు పట్టింపు లేకుండ ఆపోయిందన్నారు. ఇంటింటా కేసీఆర్ చేస్తున్న అవినీతి పాలన గురించి తెలియాలని, ఆమేరకు ప్రచారం చేయాలని అన్నారు. హుజుర్ నగర్ ఉపఎన్నికల్లో భాగంగా సోమవారం పాలకవీడు మండలం జనపహాడ్ లో ముఖ్యకార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో ఉద్యమకారులకు అవమానం జరుగుతుందన్నారు. ఆర్టీసీ కార్మికులకు జరిగిన అన్యాయం మరో శాఖ ఉద్యోగులకు జరగకుండా బీజేపీ అండగా నిలుస్తుందని చెప్పారు.

సామాన్య కార్యకర్త నుండి ఉన్నతపదవులు పొందిన వ్యక్తులు ఒక్క బీజేపీలోనే ఉంటారన్నారు. హుజూర్ నగర్ ఉప ఎన్నికల్లో కోట రామారావు గెలుపుకోసం సైనికుడిలా పనిచేయాలని, బీజేపీ కార్యకర్తలు గ్రౌండ్ వర్క్ చేస్తూ ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్టీసీలో పదోరోజుకు సమ్మె

వెనక్కి తగ్గని కార్మిక సంఘాలు

ఆదిలాబాద్,అక్టోబర్14(ఆర్ఎన్ఎ): సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె పదోరోజుకు చేరడంతో జెఎసి పిలుపు మేరకు ఆందోళన సాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కార్మికులు బస డిపోల ముందు ఆందోళనకు దిగారు. ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్ రెడ్డి అంత్యక్రియలు రాత్రి ఖమ్మంలో ముగిశాయి. మరోవైపు కర్వాన్ లో కండక్టర్ సురేందర్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్నారు. శ్రీనివాస్ రెడ్డి మృతికి సంతాపంగా ఆదివారం రాత్రి కార్మికులు క్యాండిల్ ర్యాలీలు నిర్వహించారు. మరోవైపు ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యామ్నాయ చర్యలకు పూనుకున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగవద్దనే ఆదేశాల మేరకు పాక్షికంగా బస్సులు నడిపించారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. ఉదయం నుంచి బస్టాండ్ వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. కొన్ని రూట్లలో మాత్రమే బస్సులు నడపడంతో గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. దీనిని అదునుగా తీసుకొని ప్రైవేట్ వాహనదారులు అందినకాడికి దండుకుంటున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. కార్మికులు మాత్రం వెనక్కి తగ్గకుండా సమ్మె కొనసాగిస్తున్నారు. విద్యాసంస్థలకు దసరా పండగ సెలవులు పొడిగించడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. తాత్కాలిక కండక్టర్లు, డ్రైవర్ల నియామకానికి చర్యలు చేపట్టారు.

సింగరేణి కార్మికుల మద్దతు

డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సింగరేణి కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి కార్మికులను అణచివేస్తు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని జేఏసీ నాయకులు మండిపడ్డారు. కార్మికుల్లో ఐక్యతను దెబ్బతీసే విధంగా సింగరేణి మెకానిక్ కార్మికులను ఆర్టీసీలో విధుల నిర్వహణ కోసం పురమాయించడం హేయమైన చర్య అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి సమస్యను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ , ఐఎన్టీయూసీ , సీఐటీయూ,హెచ్ఎంఎస్ నాయకులు,ఐఎఫ్‌టీయూ , టీఎస్‌యూఎస్ నాయకులు ఈ మేరకు ప్రకటించారు.

దుమారం రేపిన హర్యానా సిఎం ఖట్టార్ వ్యాఖ్యలు



సోనియాను చచ్చిన ఎలుకతో పోల్చిన నేత
క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్

ఛండీగఢ్,అక్టోబర్14(ఆర్ఎన్ఎ): హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టార్ నోరుజారి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దుమారం రేపుతున్నాయి. కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియాగాంధీని తూలనాడేలా వ్యాఖ్యలు చేసి తాజా వివాదానికి తెరలేపారు. సోనియా 'చచ్చిన ఎలుక' అంటూ ఖట్టార్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. తక్షణం ఆయన క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. గాంధీ కుటుంబేతర వ్యక్తులే కొత్త అధ్యక్షుడిగా పగ్గాలు చేపడాతరని ఆయన చెబుతూ వచ్చారు. అది మంచిదేనని మేము అనుకున్నాం. ఆశ్రితపక్షపాతం ఉండదని భావించాం. కొత్త అధ్యక్షుడి కోసం మూడు నెలల పాటు దేశమంతా గాలించారు. ఆ తర్వాత అధ్యక్షులుగా ఎవరిని తీసుకున్నారు? సోనియాగాంధీని ఎన్నుకున్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టయింది. అది కూడా చచ్చిన ఎలుకను. ఇదీ ఆ పార్టీ పరిస్థితి' అని ఖట్టార్ వ్యాఖ్యానించారు. ఖట్టార్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్ ఖాతాలో విరుచుకుపడింది. అధికార పార్టీ మహిళా వ్యతిరేక గుణాలకు బీజేపీ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు అద్దంపడుతున్నాయని, ఆ ప్రకటన గర్హనీయమని కాంగ్రెస్ పేర్కొంది. తక్షణం కట్టార్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఖట్టార్ ఈ తరహా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇది మొదటిసారి కాదు. రెండు నెలల క్రితం జమ్మూకశ్మీర్‌లో 370 అధికరణ రద్దు తర్వాత కశ్మీర్ మహిళలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇంతకు ముందు బిహార్ నుంచి కోడళ్లను తెచ్చుకునే వారిమని, ఇప్పుడు కశ్మీర్ నుంచి తెచ్చుకోవచ్చుని వ్యాఖ్యానించారు. 'బేటీ చచావో...బేటీ పడావో' విజయోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం దుమారమైంది.

తెలంగాణ పథకాలు చారిత్రకమైనవి

అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా కెసిఆర్ పాలన
-మండలి చీఫ్‌విప్ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్,అక్టోబర్14 (ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చరిత్రాత్మకమని మండలి చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని అన్నారు. గ్రామ స్వరాజ్యం దిశగా కేసీఆర్ ముందుకు సాగుతు న్నారని, ఈ ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించాలన్నారు. రైతు ఆత్మహత్యల నివారణ కోసం రైతు బంధు పథకాన్ని ప్రవేశ పెట్టి రైతులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. రైతు బీమా పథకంతో మృతి చెందిన రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పేదింటి ఆడపడుచుల పెళ్లీళ్ల కోసం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి రూ.1,00,116 ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం పెద్ద ఎత్తున గురుకుల పాఠశాలలను ప్రారంభించి నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి, సంక్షేమ పథకాలు కేసీఆర్ నాయకత్వంలో ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, రాజకీయ పబ్బం గడుపుకునేందుకే వారు తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి మాటలు నమ్మకుండా అభివృద్ధిని కోరుతూ కారు గుర్తుకుఓటు వేయాలని కోరారు. ప్రస్తుతం గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని, ప్రతి గ్రామానికి రోడ్డు మార్గం వేశామని చెప్పారు.

త్వరలోనే కొత్త స్పెక్ట్రమ్ : రవిశంకర ప్రసాద్

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: ఈ ఏడాది కొత్త స్పెక్ట్రమ్ ప్రకటన ఉంటుంది అని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ స్పష్టం చేశారు. కొత్త స్పెక్ట్రమ్‌కు త్వరలోనే టెండర్లు ప్రకటిస్తామన్నారు. ఢిల్లీ ఏరోసిటీ వేదికగా ప్రారంభమైన ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ -2019 సదస్సులో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. కొత్త స్పెక్ట్రమ్ ధరల విషయంలో సరికొత్త విధానానికి శ్రీకారం చుడుతామని ఆయన చెప్పారు. టెలికాం, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీకి భారత్ హబ్‌గా మారింది. మొబైల్ ఫోన్ల ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానానికి చేరింది. 2022 నాటికి బ్రాండ్ బాండ్ అందరికి అందుబాటులోకి వస్తుందన్నారు. 2016 నవంబర్ లో డిజిటల్ లావాదేవీలు 980 మిలియన్లు ఉంటే.. ఈ సంఖ్య ఇప్పుడు 3.32 బిలియన్ కు చేరిందన్నారు. సైబర్ సెక్యూరిటికీ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 5జీ సేవలు తీసుకువచ్చేందుకు కొన్ని సంస్థలకే అనుమతి ఇచ్చామని రవిశంకర ప్రసాద్ స్పష్టం చేశారు.ఈ సదస్సు నేటి నుంచి మూడు రోజుల పాటు కొనసాగనుంది. 5జీ టెక్నాలజీ, ఫైబర్‌నెట్, డిజిటల్ పరిజ్ఞానంలో మార్పులపై సెమినార్లు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు 40 దేశాల నుంచి పలు మొబైల్, అనుబంధ రంగాల కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఇక ప్రముఖ టెలికాం కంపెనీలు, ఫేస్‌బుక్ వంటి దిగ్గజ సంస్థల స్టాళ్లను ఏర్పాటు చేశారు.

క్రీడలు

బీసీసీఐ నిర్వహణ ఓ సవాలే : సౌరవ్ గంగూలీ

హైదరాబాద్: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు అధ్యక్షుడిగా సౌరవ్ గంగూలీ బాధ్యతలు స్వీకరించే అవకాశాలు ఉన్నాయి. దీనిపై ఇవాళ బెంగాల్ దాదా సౌరవ్ స్పందించారు. భారత క్రికెట్ బోర్డుకు నాయకత్వం వహించడం గొప్ప అనుభూతినిస్తుందన్నారు. బీసీసీఐ ప్రతిష్టను బలోపేతం చేసేందుకు ఇదో మంచి తరుణమన్నారు. వాస్తవానికి బ్రిజేష్ పటేల్ .. బీసీసీఐ అధ్యక్ష రేసులో ఉన్నారు. కానీ అనూహ్య పరిణామాల నేపథ్యంలో గంగూలీకి ఆ బాధ్యతలు దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. దేశం కోసం ఆడాను, సారథిగా కూడా బాధ్యతలు చేపట్టాను, గత మూడేళ్ల నుంచి బీసీసీఐ పనితీరు సరిగా లేదని, ఇలాంటి సందర్భంలో బాధ్యతలు స్వీకరించడం గొప్ప అవకాశమే అని గంగూలీ అన్నారు. క్రికెట్‌కు ఏదైనా మంచి చేయాలన్నదే తన ఉద్దేశమన్నారు.

47 ఏళ్ల గంగూలీ ప్రస్తుతం బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు. దేశవాళీ క్రికెట్ ఆడే ఫస్ట్ క్లాస్ క్రికెటర్లను ఆర్థికంగా బలోపేతం చేయడమే తన మొదటి కర్తవ్యమన్నారు. నిజానికి బీసీసీఐ అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేసేందుకు సోమవారమే చివరితేది. కానీ గంగూలీ నియామకం పట్ల వ్యతిరేకత వ్యకం కాలేదు. దీంతో ఎవరూ నామినేషన్ వేయలేదు. ఏకపక్షంగా గెలవడం ముఖ్యం కాదు అని, ప్రపంచ క్రికెట్‌లోనే బీసీసీఐ అతిపెద్ద సంస్థ అని, దాని బాధ్యతలు చూసుకోవడం ముఖ్యమన్నారు. ఆర్థికపరంగా బీసీసీఐ కీలకమైందని, అలాంటి సంస్థకు అధ్యక్ష బాధ్యతలు నిర్వహించడం సవాలే అని గంగూలీ అన్నారు.

ఖమ్మం జిల్లా బంద్ ప్రశాంతం

డిపోల నుండి బస్సులు రాకుండా అడ్డుకున్న కార్మికులు
మూతపడ్డ వాణిజ్య, వ్యాపార సముదాయాలు
శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

ఖమ్మం,అక్టోబర్14(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డ్రైవర్ శ్రీనివాస్ రెడ్డి బలిదానానికి సంతాపంగా ఖమ్మం జిల్లాలో సోమవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా సాగింది. ఉదయాన్నే కార్మికులు రోడ్లపైకి వచ్చి డిపోల నుంచి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. బంద్ సందర్భంగా వాణిజ్య, వ్యాపార సముదాయాలను స్వచ్ఛందంగా మూసివేశారు. ఆర్టీసీ బంద్‌కు కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, సీపీఎం, న్యూ డెమోక్రసీ, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు మద్దతుగా జిల్లాలో ర్యాలీలు చేపట్టాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆరు డిపోల్లో బస్సులు నిలిచిపోయాయి. అన్ని డిపోల ఎదుట ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో సంతాప సభలు ఏర్పాటు చేశారు. బంద్ నేపథ్యంలో జిల్లాలో భారీగా పోలీసులు మోహరించారు. బంద్‌లో భాగంగా సత్తుల్లి ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు నిరసన తెలిపారు. బస్సులు బయటకు వెళ్లనీయకుండా ఇన్‌గేట్, అవుట్‌గేట్ వద్ద మహిళ కార్మికులు భైఠాయించారు. కాగా బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన ప్రతిపక్ష పార్టీలు, పలు సంఘాల నేతలు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భద్రాద్రి కొత్తగూడెంలోని మణుగూరులో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. పలు వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. కార్మికులకు మద్దతుగా పలు రాజకీయపార్టీ నేతలు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డ్రైవర్ శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఇల్లందు నియోజకవర్గంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఆర్టీసీ కార్మికులతో పాటు పలు రాజకీయ, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు. అఖిలపక్షం ఇచ్చిన పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం చర్లలో బంద్ సాగింది. పలు వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తున్నాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఖమ్మం జిల్లా కోర్టు లాయర్లు మద్దతు తెలిపారు. విధులు బహిష్కరించి సమ్మెకు సంఘీభావం తెలిపిన లాయర్లు జిల్లా కోర్టు నుండి డిపో వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మొండి వైఖరిని వీడి వెంటనే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో కార్మికులు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. బస్సు డిపో నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి కేసీఆర్ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తక్షణమే స్పందించి ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తీరుతో కార్మికులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, దీంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బలవన్మరణానికి పాల్పడిన శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

కండక్టర్ సురేందర్ గౌడ్ మృతదేహానికి నివాళి అర్పించిన అనంతరం మాట్లాడుతున్న లక్ష్మణ్

ఆత్మహత్యలు వద్దు..
పోరాడి సాధించుకుందాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్
- సురేందర్ మృతదేహానికి లక్ష్మణ్ నివాళి

హైదరాబాద్,అక్టోబర్14 (ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని, ధైర్యంగా సమస్యలపై పోరాడి సాధించుకుందామని, అందుకు బీజేపీ అండగా నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆత్మహత్యకు పాల్పడిన రాణిగంజ్ డిపో కండక్టర్ సురేందర్‌గౌడ్ మృతదేహానికి సోమవారం లక్ష్మణ్ సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సురేందర్ గౌడ్ తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. సోమవారం ఆయన మృతదేహానికి ఉస్మానియాలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సురేందర్ గౌడ్ కుటుంబసభ్యులను బీజేపీ నేత లక్ష్మణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతుంటూ మొండి వైఖరితో కేసీఆర్ సమస్యలు పరిష్కరించకుండా వారిని రెచ్చగొడుతున్నారని అన్నారు. ఆర్టీసీ కార్మికులెవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, పోరాడి మన హక్కులు సాధించుకుందామని లక్ష్మణ్ సూచించారు. శ్రీనివాసరెడ్డి, సురేందర్ గౌడ్ మృతితో మరో తెలంగాణ ఉద్యమం మొదలైందని తెలిపారు. కార్మికుల ఉసురు కేసీఆర్‌కు తప్పకుండా తగులుతుందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీజేపీ కార్మికుల పక్షాన పోరాడుతుందని అన్నారు.

ఆర్టీసీ ఆస్తులపై..
కేసీఆర్ కన్ను పడింది

- వరంగల్‌లోని ఆర్టీసీ ఆస్తులను ఓ ఎంపీకి ధారాదత్తం చేశారు
- కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి

నల్గొండ, అక్టోబర్14(ఆర్ఎన్ఎ) : సీఎం కేసీఆర్ కన్ను ఆర్టీసీ ఆస్తులపై పడిందని, అందుకే ఆర్టీసీని ప్రైవేట పరం చేసేందుకు కుట్రపన్నుతున్నారని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం నల్గొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ ఆస్తులపై కేసీఆర్ కన్ను పడిందన్నారు. ఇందులో భాగంగానే వరంగల్‌లో ఆర్టీసీ ఆస్తులను ఓ ఎంపీకి ధారాదత్తం చేశారని ఆరోపించారు. కేసీఆర్ ఏది మాట్లాడినా మోసమేనని విమర్శించారు. అయితే ... నియంత... ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏపీ సీఎం జగన్‌ను చూసి కేసీఆర్ బుద్ధి తెచ్చుకోవాలని హితవుచెప్పారు. ఆర్టీసీపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయనడం సరికాదన్నారు. ఆర్టీసీ కార్మికుల అన్యాయం చేస్తుంటే చూస్తూ కూర్చోవాలా అని ప్రశ్నించారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు ఖచ్చితంగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ఆందోళనలో పాల్గొని మరింత ఉధృతం చేస్తామని కోమటిరెడ్డి అన్నారు. ఇదే సమయంలో ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సమ్మెపై టీఎన్జీవో నేతల వ్యాఖ్యలు సరికాదన్నారు. ఆర్టీసీ కార్మికులు సమస్యల కోసం పోరాడుతుంటే వారికి మద్దతు తెలపకుండా టీఎన్జీవో నేతలు సీఎం కేసీఆర్‌ను కలవటం ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నారు. ఆర్టీసీ కార్మికులు అధైర్యపడొద్దని, తెలంగాణ సమాజం కార్మికుల వెంట ఉందని ఎంపీ వెంకట్ రెడ్డి ధైర్యం చెప్పారు.

కార్మికుల ఆత్మహత్యలన్నీ..
ప్రభుత్వ హత్యలే

- సమ్మె గురించి టీఎన్జీవో, టీజీవో నేతలకు చెప్పాం
- కేకే మధ్యవర్తిత్వం చేస్తే మంచిదే
- సమ్మెపై గవర్నర్‌కు మెమోరాండం ఇచ్చాం
- కార్మికులపై పోలీసులు చేస్తున్న దాడిని గవర్నర్‌కు వివరించాం
- ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి

హైదరాబాద్, అక్టోబర్14 (ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందో లేదో అర్థం కావడం లేదని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. ఆర్టీసీ సమ్మె పై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తో ఆర్టీసీ జేఏసీ నాయకులు సోమవారం భేటీ అయ్యారు. భేటీ అనంతరం అశ్వత్థామ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. సమ్మెపై గవర్నర్ కు మెమోరాండం ఇచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీ కార్మికులు చేస్తున్న ఉద్యమం,పోలీస్ కార్మికులపై దాడి చేసిన వీడియోలను అందజేసినట్లు సూచించారు. హక్కుల కోసం 10 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసులు చేస్తున్న దాడిని గవర్నర్ కు వివరించినట్లు చెప్పారు. కార్మికుల ఆత్మహత్యలన్ని ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. నిజామాబాద్ సభలో కేసీఆర్ ఆర్టీసీ ని విలీనం చేస్తామని హామీ ఇచ్చారని అశ్వత్థామరెడ్డి పేర్కొన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు, శ్రీనివాస్ యాదవ్, పువ్వాడ తెలంగాణ ఉద్యమంలో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు అంటే తమకు గౌరవం ఉందని అన్నారు. ఉద్యమం సమయంలో కేకే ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన మధ్యవర్తిత్వం చేస్తే మంచిదేనని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా... ఆర్టీసీ కార్మికులను గుర్తిస్తామన్న హామీకి సీఎం కేసీఆర్ కట్టుబడాలన్నారు. కేకే చర్చలకు ఆహ్వానిస్తే తాము రావడానికి సిద్ధమన్నారు. కొందరు మంత్రులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని అశ్వత్థామరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ జేఏసీ నేతలు ఎక్కడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయలేదన్నారు. టీఎన్జీవో, ఎన్జీవో నేతలు ముఖ్యమంత్రి తో భేటీ అవ్వడం తప్పులేదన్నారు. కానీ ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నప్పుడు ఆర్టీసీ జేఏసీకి మద్దతు ఇవ్వకుండా సీఎంతో సమావేశం అవ్వడం బాధాకర విషయమన్నారు. శ్రీనివాస్ రెడ్డి చనిపోవడం వల్ల తాము టీఎన్జీవో, టీజీవో నేతలను కలవలేకపోయామని, త్వరలో వారితో చర్చలు జరుపుతామని అన్నారు. ఎవరి ప్రలోభాలకు లొంగలేదని స్పష్టం చేశారు. టీఎన్జీవో నేతలకు ఆర్టీసీ సమ్మె గురించి చెప్పలేదనడం సరికాదన్నారు. ఉద్యోగ సంఘాల నేతలపై తమకు నమ్మకం ఉందని అశ్వత్థామరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

రెండు రుపాయలు తగ్గిన పెట్రోల్ ధరలు..!

న్యూఢిల్లీ,అక్టోబర్14(ఆర్ఎన్ఎ): వాహనాదారులకు మరోమారు శుభవార్త. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. ఒకానొక దశలో లీటర్ పెట్రోల్ ధర 79 రూపాయలు దాటి.. వాహన దారులను హడలెత్తించింది. సెప్టెంబర్, ఆగష్టు నెలలో పెట్రోల్ ధరలు పెరుగుతూ వచ్చాయి. రెండు నెలల నుంచి పెట్రోల్ ధరలు గమనిస్తే.. దాదాపుగా ఇప్పుడు రెండు రూపాయలకు పైగానే ధర తగ్గిందని చెప్పవచ్చు. అక్టోబర్ నెల 1నుంచి పెట్రోల్ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. 'అరాంకో' చమురు కర్మాగారంపై జరిగిన డ్రోన్ దాడితో.. అంతర్జాతీయంగా మార్కెట్‌ను కుదిపేసింది. దీంతో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయనే వార్త అందరిలోనూ గుబులు రెకెత్తించింది. ఒకానొక టైంలో లీటర్ పెట్రోల్ 100 రూపాయలు దాటుతుందని అని అన్నారు. కానీ.. అందుకు విరుద్ధంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతూ వచ్చాయి. అలాగే.. అంతార్జాతీయంగా కూడా పెట్రోల్, డీజిల్ ధరలు దిగి వస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో లీటర్ పెట్రోల్ ధర రూ.77.21గా ఉంది. డీజిల్ లీటర్ ధర 72 రూపాయలుగా ఉంది. అలాగే.. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోలు రూ.73.32 కాగా.. డీజిల్ రూ. 66.46గా ఉంది. ఇక దేశ ఆర్థికనగరం అంటే ముంబైలో లీటర్ పెట్రోల్ ధర రూ.78.93 కాగా.. డీజిల్ రూ.69.66గా ఉంది. ఇక చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.76.14 కాగా.. డీజిల్ రూ.70.20గా ఉంది. మొత్తంగా చూస్తే ముంబైలో పెట్రోల్, డీజిల్ ధరలు కాస్త ఎక్కువగా ఉన్నాయి.

ఆర్టీసీని విలీనం చేస్తే
కేసీఆర్‌కు పాలాభిషేకం చేస్తా

- సమస్యలు పరిష్కరించకపోతే మంత్రి అజయ్‌ను ఘెరావ్ చేస్తాం
- కాంగ్రెస్ నేత, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్14(ఆర్ఎన్ఎ) : ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేస్తే కార్మికులతో పాటు తాను కూడా ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావుకు పాలాభిషేకం చేస్తానని కాంగ్రెస్ నేత, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో సోమవారం ఆర్టీసీ కార్మికుల ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ కార్మికులు శ్రీనివాస్ రెడ్డి, సురేంద్ర గౌడ్‌లకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇద్దరు ఆర్టీసీ కార్మికుల ఆత్మ బలిదానం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఫోటోలకు పాలు పోసి పూజలు చేసిన ఆర్టీసీ కార్మికులే నేడు ఆయనను నిందించే పరిస్థితి రావడం విచారకమన్నారు. ఆర్టీసీ విలీనంపై రేపటికల్లా సీఎం కేసీఆర్‌ను ఒప్పించాలని రవాణా శాఖ మంత్ర పువ్వాడ అజయ్‌కుమార్‌ను డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రిని ఒప్పించకపోతే సంగారెడ్డి డిపోకు చెందిన 600 మంది కార్మికులతో హైదరాబాద్ తరలివచ్చి మంత్రిని ఘోరావ్ చేస్తానని హెచ్చరించారు. మంత్రి ఇంటిని ముట్టడించేందుకు ఆర్టీసీ కార్మికులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో కేసీఆర్ ప్రభుత్వం మొండివైఖరిని విడనాడాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని రంగాల్లో ఉద్యోగులకు న్యాయం చేస్తున్నామంటున్న కేసీఆర్ ఒక్క ఆర్టీసీ కార్మికులపైనే ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆర్టీసీని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు చేయడాన్ని వెంటనే విరమించుకోవాలని, లేకుంటే ఆందోళన మరింత ఉధృతం అవుతుందని జగ్గారెడ్డి హెచ్చరించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే, ఐజెయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల చేపట్టిన ధర్నాకు ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి తెలిపారు. విలేకరుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

తేమలేకుండా పత్తిని తీసుకుని రావాలి

ఆరబెట్టిన తరవాతనే పత్తిని కొనుగోలు చేస్తాం

ఆదిలాబాద్,అక్టోబర్14 (ఆర్ఎన్ఎ): త్వంలో చేపట్టే పత్తి కొను గోళ్లకు ఏర్పాట్లు సాగుతున్నారు. రైతులు తమ పత్తిని ఆరబెట్టుకొని మార్కెట్ యార్డుకు తీసుకరావాలని మార్కెటింగ్ అధికారులు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తేమ శాతం పై ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్యదర్శులందరూ పత్తి కొనుగోళ్ల సమయంలో మార్కెట్ యార్డుల్లో అందుబాటులో ఉండాలని సూచించారని అన్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో త్వరలో పత్తి కొనుగోళ్లను ప్రారంబిస్తున్నట్లు తెలిపారు. పూర్వపు జిల్లాలో 18 మార్కెట్ యార్డులు ఉండగా.. ఆదిలాబా ద్‌లో 9, నిర్మల్‌లో 5, మంచిర్యాల్‌లో 4, ఆసిఫాబాద్‌లో 4 మార్కెట్ యార్డులు ఉన్నాయని తెలిపారు. ముందుగా ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో కొనుగోళ్లను ప్రారంభిస్తామని, మిగతా మార్కెట్ యార్డుల్లో దసరా అనంతరం కొనుగోళ్లు ప్రారంభం అవుతాయన్నారు. అన్ని మార్కెట్ యార్డుల్లో రైతుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఇప్పటికే ఎలక్ట్రానిక్ కాంటాలకు మరమ్మతులు చేసి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. రైతు పత్తిని అమ్ముకోడానికి మార్కెట్ యార్డుకు వచ్చే ముందు ఇటీవల జారీ చేసిన గుర్తింపు కార్డు, బ్యాంక్ జిరాక్స్ కాపీ వెంట తీసుకరావాలన్నారు. కార్డులేని రైతులు ఆధార్, ఏఈవోల నుంచి ధ్రువీకరణ పత్రాలను తీసుకరావాల్సి ఉంటుందని తెలిపారు. దళారులు రైతుల పేర్లపై సీసీఐకి పత్తి అమ్మకుండా వీలు ఉంటుందన్నారు. పత్తి విక్రయించిన మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని చెప్పారు. ప్రతి రైతు వేలి ముద్రను మార్కెట్ యార్డులో తీసుకోవడం జరుగుతోందని తెలిపారు. 12శాతం మాయిశ్చర్ వరకు సీసీఐ అధికారులు పత్తిని కొనుగోలు చేస్తారన్నారు. 8శాతం తేమ వస్తే రూ.5,450 క్వింటాల్‌కు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తారని తెలిపారు.

మంత్రుల వ్యాఖ్యలపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే

కెసిఆర్,మంత్రులపై ఫిర్యాదు
కేసు నమోదు చేయాలన్న బోడిగె శోభ

కరీంగనర్,అక్టోబర్14(నేటినిజం ప్రతినిధి) తెలంగాణ సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ మంత్రులపై కరీంనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు నమోదైంది. కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ ఫిర్యాదు చేశారు. సీఎం కేసీయార్ కార్మికుల ఆత్మహత్యకు బాధ్యత వహించాలని శోభ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్టీసీ సమ్మె చేస్తున్న కార్మికులు మంత్రులు మాట్లాడుతున్న మాటలతో మనస్తాపానికి గురవుతున్నారని చెప్పారు. 24 గంటల లోపు కేసు నమోదు చేయ లని పోలీసులకు సూచించారు. పోలీసులు కేసు నమోదు చేయకపోతే పోలీస్ స్టేషన్ ముందు కూర్చుంటానని శోభ చెప్పారు. సీఎం కేసీయార్ తో పాటు గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్ కుమార్, తలసాని శ్రీనివాస్ యాదవ్ పై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. బీజేపీ ఎమ్మెల్యేతో కలిసి వెళ్లి శోభ ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. నిన్న బొడిగ శోభ ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపింది. టీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమ్మె గురించి పట్టించుకోవటం లేదని శోభ అన్నారు. విద్యార్థులు ఆర్టీసీ సమ్మెకు మద్దతు ఇస్తారని విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని శోభ అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టుబడి దారుల చేతుల్లో ఉందని అన్నారు. మరో వైపు ఆర్టీసీ కార్మికుల సమ్మె రోజురోజుకు ఉధృతమవుతోంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా నియమించిన ఆర్టీసీ డ్రైవర్లపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఆర్టీసీ తాత్కాలిక డ్రైవర్ మూసాపేట్ నుండి కూకట్ పల్లి వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టాడు. బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురికాగా మద్యం మత్తులో బస్సు నడిపాడని డ్రైవర్ రసూల్ ను ప్రయాణికులు కొందరు చితగ్గొట్టారు. ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడటంతో ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు. ఆర్టీసీ కార్మికులు కొన్ని జిల్లాల్లో బంద్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

IN THE COURT OF THE
M.A.C.T-CUM-XII
ADDL CHIEF JUDGE
CITY CIVIL COURT AT
SECUNDERABAD
M.V.O.P NO. 255 OF 2017

Between:
Mr. B. Darshan
...Petitioner
And
Mr.M. Bikshapathi and others
..Respondents

To
1) Mr. Mailaram Bikshapathi S/o. M. Balaji, Age: Major Occ: Owner of Car bearing No. AP 28DQ 5553, H.No. 1-41/A, Kacharam Village, Shamshabad, R.R.Dist.
..Respondent No.1
2) Mr. Katika Narender S/o. K. Yenkiji, Age: 38 years Occ: Driver of Car bearing No. AP 28DQ 5553, H.No. 4-28, Tondpally, Shamshabad, R.R.Dist.
..Respondent No.3

Whereas the above named Petitioners filed compensation petition against you and The Tata AIG General Insurance Company Ltd for a sum of Rs. 5,00,000/- for the accident caused by your **Car bearing No. AP 28DQ 5553** on 07-01-2017 at Shamshabad ps limits. The above case is posted on **25-11-2019.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 AM on the above said date before the Hon'ble court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE COURT)
C. VENU GOPAL REDDY
S. VENKAT REDDY
A. POORNACHANDRA RAO
Advocate.
Off: 2-4-120/18,
Swaroop Nagar
Uppal, Hyderabad.
Cell: 9440431541

ఆర్టీసీ సమ్మెకు పవన్ మద్దతు

- ఉద్యోగులను తొలగించడం తనకు బాధ కలిగించింది
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్

హైదరాబాద్, అక్టోబర్14(ఆర్ఎన్ఎ) : తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు పెరుగుతోంది. ఆర్టీసీ సమ్మెకు ఓయూ విద్యార్థి జేఏసీ మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆర్టీసీ జేఏసీ ఈ నెల 19న తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. ఈ బంద్‌కు జనసేన పార్టీ మద్దతు ప్రకటించింది. ఆర్టీసీ కార్మికుల సమ్మె తీవ్ర రూపం దాల్చిన తరుణంలో.. కార్మికుల ఆవేదనను అర్థం చేసుకోవాలని పవన్ కళ్యాణ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీ సమ్మె, తాజా పరిస్థితులపై ఆయన సోమవారం పార్టీ నాయకులతో హైదరాబాద్‌లోని జనసేన కార్యాలయంలో సమీక్ష జరిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 19న ఆర్టీసీ కార్మికుల జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. బంద్ సందర్భంగా ఎలాంటి హింసకు తావులేకుండా.. శాంతియుత నిరసనలు చేపట్టాలని కోరారు. ఖమ్మంలో శ్రీనివాస్‌రెడ్డి, రాణిగంజ్ డిపోకు చెందిన సురేందర్ గౌడ్‌లు బలవన్మరణానికి పాల్పడటం సమ్మె తీవ్రతను తెలియజేస్తుందని అన్నారు. కార్మికుల డిమాండ్లు ఎంతవరకు ఆమోదయోగ్యం అనే అంశాన్ని పక్కనబెట్టి వారి ఆవేదనను అర్థం చేసుకోవాలని కోరారు. ఒకే సారి 48వేల మంది ఉద్యోగులను తొలగించడం తనకు బాధ కలిగించిందని చెప్పారు. ఇలా చేయడం ఉద్యోగ భద్రతను ప్రశ్నార్థకం చేస్తుందన్నారు. ప్రభుత్వం కార్మికులతో చర్చలు జరిపి.. వారి డిమాండ్లను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని పవన్‌కళ్యాణ్ డిమాండ్ చేశారు.

వైద్యం కోసం వెళ్లిన యువతిపై నాలుగేళ్లుగా అత్యాచారం

బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరింపులు
యువతి ఫిర్యాదుతో పోలీసుల కేసు

ముంబయి, అక్టోబర్ 14 (ఆర్ఎన్ఎ): వైద్యం కోసం వెళ్లిన ఓ యువతిపై నాలుగేళ్లుగా డాక్టర్ అత్యాచారం చేస్తున్న ఘటన వెలుగు చూసింది. ఈ దారుణ ఘటన మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని మేఘ్వాడి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పైల్స్(అర్శమొలలు) వ్యాధి కారణంగా 27 ఏళ్ల యువతి డాక్టర్ వంశ్‌రాజ్ ద్వివేది(58) వద్దకు 2015లో వెళ్లింది. అయితే శస్త్ర చికిత్సలో భాగంగా ఆమెకు మత్తు మందు ఇచ్చి ఆ తర్వాత అత్యాచారం చేశాడు. దీన్ని తన సెల్‌ఫోన్లో చిత్రీకరించాడు. ఇక ఈ వీడియోను ఆసరా చేసుకున్న డాక్టర్ ద్వివేది యువతిని లొంగదీసుకున్నాడు. తన వద్దకు రాకపోతే ఆ వీడియోను వైరల్ చేస్తానని బెదిరించాడు. దీంతో చేసేదేమీ లేక యువతి.. డాక్టర్ పిలిచినప్పుడల్లా వెళ్లేది. అయితే ఇటీవలే బాధిత యువతికి వివాహం అయింది. అప్పట్నుంచి డాక్టర్ ఫోన్‌కు సమాధానం ఇవ్వడం లేదు యువతి. దీంతో ఆ వీడియోలను ద్వివేది వైరల్ చేశాడు. వీడియో యువతి భర్తకు చేరడంతో ఆమెను నిలదీశాడు. జరిగిన విషయాన్ని తన భర్తకు యువతి చెప్పడంతో.. డాక్టర్ ద్వివేదిపై పోలీసులకు భర్త ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి.. ద్వివేదిని అరెస్టు చేశారు. అక్టోబర్ 17వ తేదీ వరకు డాక్టర్‌కు రిమాండ్ విధించారు.

సౌతాఫ్రికాలో గ్రీన్ ఛాలెంజ్

హైదరాబాద్, అక్టోబర్ 10: హరిత తెలంగాణ కోసం తన వంతు మద్దతుగా టీఆర్ఎస్ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్‌ఛాలెంజ్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. గతేడాది సంతోష్ నాటిన ఒక్క మొక్కతో మొదలైన గ్రీన్ ఛాలెంజ్ నేడు ప్రపంచ దేశాలకు విస్తరించింది. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే 3 కోట్లకు పైగా మొక్కలు నాటారు. టీఆర్ఎస్ ఎన్నారై కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల ఛాలెంజ్‌ను స్వీకరించి అమెరికాలో మొక్కలు నాటి అనంతరం పలు దేశాల్లోని టీఆర్ఎస్ ఎన్నారై ప్రతినిధుల ను నామినేట్ చేశారు. టీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా ప్రెసిడెంట్ గుర్రల నాగరాజు ఛాలెంజ్‌ను స్వీకరించి స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. 60 మొక్కలను పంపిణీ చేసి విద్యార్థులతో నాటించారు. ఈ కార్యక్రమంలో అక్కడ నివసిస్తున్న తెలంగాణ ప్రజలు, టీఆర్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు తమవంతుగా సహకరించాలని అధిక సంఖ్యలో చెట్లను నాటడం వల్ల వాతావరణంలో గాలి నాణ్యత మెరుగువుతుందని చెప్పారు.

తిరుమలలో పెరిగిన రద్దీ

తిరుపతి,అక్టోబర్14(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి సర్వదర్శనానికి వైకుంఠ క్యూకాంప్లెక్స్ లు అన్ని నిండి బయట వేచి ఉన్నారు. సాధారణ సర్వదర్శనానికి 16 గంటల సమయం, టైమ్‌స్లాట్ టోకెన్లు పొందిన భక్తులకు 4 గంటల సమయం పడుతోంది. దసరా పండుగ సందర్భంగా నిన్న శ్రీవారిని 1,03,310 మంది దర్శించుకున్నారు. 41,098 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.